విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శుక్రవారం 09 మే 2025 8 పేజీలు

సాగుకు ముందే మట్టి పరీక్షలు పూర్తిచేసేలా ప్రణాళిక అవగాహన లేమితో కొందరు...అధిక దిగుబడుల కోసమని మరికొందరు ఇష్టం వచ్చినట్లుగా అవసరం లేకపోయినా రసాయన ఎరువులను వాడుతూ భూసారాన్ని నిస్సారం చేస్తున్నారు. ప్రమాదకర స్థాయిలో ఉన్న పుడమిని పరీక్షించి సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి అటు నేలతల్లిని రక్షించి..ఇటు రైతులను ఆదుకునేలా ప్రభుత్వం ఆరోగ్య పరీక్షలపై దృష్టి సారించింది. సకల పోషకాలకు నెలవుగా ఉండాల్సిన భూమి రసాయనాలతో నాశనమవుగా భూసారం నానాటికి తగ్గిపోతోంది. రసాయన ఎరువుల వాడకంలో సమతుల్యతను పాటిస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవు. ఈ పరిస్థితులలో నేలలో ఏ ఏ పోషకాలు లోపించాయో గుర్తించి వాటిని మాత్రమే వినియోగించేలా రైతులకు చెప్పి వారిని చైతన్య పరిచేందుకు వ్యవసాయ శాఖ సమాయత్తమైంది. మట్టి పరీక్షలు చేసి ఈ నెల 15వ తేదీకి హెల్త్ కార్డులు రైతులకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ధారించింది.

పుడమికి పరీక్షలు

- భూ ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి
- ఈనెల 15 నాటికి హెల్త్ కార్డుల జారీ

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: పంటల సాగులో భూసార పరీక్షలు ఎంతో కీలకం. భూమిలో సారం ఎంత ఉందో పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు.నేలలో సూక్ష్మ పోషకాలు ఏ మోతాదులో ఉన్నాయో పరీక్షల ద్వారా గుర్తిస్తారు. ఆయా పరీక్షల ఆధారంగా భూసారాన్ని నిర్ధారించి ఏ పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చో అన్నదాతలకు తెలియజేస్తారు. భూసారం బాగుంటేనే పంటలు దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. ఇంతటి కీలకమైన పుడమి ఆరోగ్య పరీక్షలకు వ్యవసాయశాఖ సమాయత్తమైంది. పంటల సాగుకు ముందే మట్టి పరీక్షలు పూర్తిచేసి నేల హెల్త్‌కార్డులను రైతులకు అందజేయాలని

ప్రభుత్వం నిర్దేశించింది. ఏలూరు జిల్లాలో 30,062, పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 21,656 మట్టి నమూనాలను సేకరించి పరీక్ష చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. ఈ నెల 15వ తేదీకి పరీక్షలు పూర్తిచేసి హెల్త్ కార్డుల పంపిణీ పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఆయా పరీక్షల ద్వారా సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి ఎంత మోతాదులో ఏఏ ఎరువులు వాడాలో రైతులకు అధికారులు సూచిస్తారు. పరీక్షలు ఆధారంగానే పంటల సాగుపై రైతులకు సూచనలు చేయనున్నారు. గత వైసిపి పాలనలో భూసార పరీక్షలు అటకెక్కాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ నేల ఆరోగ్యంపై దృష్టి సారించింది. ఈ క్రమంలో గత ఏడాది కూడా విస్తృతంగా భూసార పరీక్షలు ▶మిగతా 2లో..

శాంతి భద్రతల పరిరక్షణ మా కర్తవ్యం

ఐ.జి అశోక్ కుమార్

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : జిల్లాలో శాంతి భద్రతలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్మూలన,నేర నియంత్రణే ప్రధమ కర్తవ్యం అని ఏలూరు రేంజ్ ఐ.జి అశోక్ కుమార్ అన్నారు. గురువారం పశ్చిమగోదావరి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో వార్షిక తనిఖీ నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం పోలీసు అధికారులతో జిల్లాలో శాంతి భద్రతలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించు పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, రికార్డు నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, పలు అంశాలపై అధికారులు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో కీలకమైన పెండింగ్ గ్రేవ్ కేసులు, పాత నేరస్థులు, సస్పెక్ట్ షీట్స్ తదితర అంశాల పై వివరాలను

అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతల పరిరక్షణ,నేర నియంత్రణ,మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతగా విధులు ఉండాలని, అట్రాసిటీ, ప్రాపర్టీ, మహిళ సంబంధిత కేసుల దర్యాప్తు త్వరిత గతిన పూర్తి చేసి, ఫోక్సో వంటి కేసులలో నిర్ణీత 60 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేసి ఛార్జ్ షిట్ లను కోర్టులో ▶మిగతా 2లో..

కలెక్టర్ షన్మోహన్‌కు పురస్కారం

విశాలాంధ్ర - కాకినాడ : ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం, అంతర్జాతీయ తలసేమియా దినోత్సవం సందర్భంగా గురువారం విజయవాడలోని రాజభవన్ దర్బార్ హాలులో ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్సిఎస్) రాష్ట్ర శాఖ అధ్యక్షులు ఎస్ అబ్దుల్ నజీర్ ముఖ్యఅతిథిగా పాల్గొని జిల్లా కలెక్టర్లకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 20 రక్త దాన కేంద్రాలు ఉన్నాయని, అందులో ప్రతి సంవత్సరం 65 వేల రక్త యూనిట్లు పైగా సేకరిస్తున్నట్టు తెలిపారు. ఇందులో నుంచి అవసరం ఉన్న ప్రజలకు లక్షకు పైగా యూనిట్ల రక్తం ఇవ్వడం జరుగుతుందని, అందులో మూడవ వంతు యూనిట్లు ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్స పొందే పేద రోగులకు ఉచితంగా

సరఫరా చేస్తున్నామన్నారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ రెడ్ క్రాస్ ద్వారా విశిష్ట సేవలు అందించిన కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలికి బంగారు పతకం, పురస్కారం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రథమ మహిళ సమీరా నజీర్, గవర్నర్ కార్యదర్శి డాక్టర్ ఎం. హరిజవహర్లాల్, ఐఆర్‌సిఎస్ చైర్మన్ వైడి రామారావు, రెడ్‌క్రాస్ ఆంధ్రప్రదేశ్ శాఖ సీఈవో, ప్రధాన కార్యదర్శి ఏకే ఫరీదా, రాజభవన్ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ నాగరాణికి అవార్డు

విశాలాంధ్ర -భీమవరం: విపత్కర పరిస్థితుల్లో నిస్వార్థమైన మానవతా సేవలను అందించడానికి ప్రతి ఒక్కరు ముందుండాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం, ప్రపంచ తలసేమియా దినోత్సవం పురస్కరించుకొని విజయవాడ రాజ్ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో గవర్నర్, ఐ.ఆర్.సి.ఎస్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అవార్డును, గోల్డ్ మెడల్ ను కలెక్టర్ స్వీకరించారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఏర్పడిన వరదల

సమయంలో అత్యుత్తమ సేవలను అందించినందుకు గుర్తింపుగా 2024-25 సంవత్సరానికి కలెక్టర్ చదలవాడ నాగరాణిని రెడ్ క్రాస్ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ అధ్యక్షులు చదలవాడ నాగరాణి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ అవార్డుకు ఎంపికై గౌరవ ▶మిగతా 2లో..

సమన్వయంతో దెందులూరు నియోజకవర్గ అభివృద్ధి

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: దెందులూరు నియోజకవర్గ అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని ఏలూరు ఎంపి పుట్టా మహేష్ కుమార్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ లు అధికారులకు దిశా, నిర్దేశం చేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో దెందులూరు నియోజకవర్గ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏలూరు ఎంపి పుట్టా మహేష్ కుమార్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యాన, ఇరిగేషన్, పశు సంవర్ధక శాఖ, పిఆర్, ఆర్ అండ్ బి, విద్యుత్, రెవిన్యూ, తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులతో సుదీర్ఘ సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఎంపి పుట్టా మహేష్ కుమార్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

దెందులూరు నియోజకవర్గ అభివృద్ధిపై లేవనెత్తిన పలు అంశాలపై జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పందిస్తూ అందుకు సంబంధించిన పరిష్కార చర్యలకు సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఏలూరు ఎంపి పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ ఎంపి ల్యాడ్స్‌కు సంబంధించి 2014-19 చేపట్టిన పనులకు సంబంధించిన వివరాలు, 2019-24 సంబంధించిన పనులు వివరాలుపై సమీక్షిస్తూ పనులు చేపట్టి అసంపూర్తిగా మిగిలిన పనులను చేపట్టేందుకు ప్రతిపాదనలను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొల్లేరు రైతుల విషయంలో మానవతా ధృక్పథంతో అటవీశాఖ అధికారులు వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రజలు ఇబ్బంది పడే ఏచర్యలను చేపట్టవద్దని సూచించారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో నియోజకవర్గ అభివృద్ధికి అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ▶మిగతా 2లో..

మున్సిపల్ రెవెన్యూ అధికారిగా రంగారావు

విశాలాంధ్ర -భీమవరం: భీమవరం పురపాలక సంఘం రెవెన్యూ అధికారిగా బి.రంగారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గిద్దలూరు నగరపంచాయితీ నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపల్ కమిషనర్ కె.రామ చంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన రంగారావును పలు విభాగాల అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర-పెదపాడు: పెదపాడు శాఖ గ్రంథాలయంలో ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. దీనిలో భాగంగా గురువారం విద్యార్థిని విద్యార్థులకు జన గణ మన జాతీయ గీతం వ్రాసిన "రవీంద్రనాథ్ ఠాగూర్" జీవిత చరిత్రను వివరించారు. ఆయనకు గీతాంజలి కావ్యానికి సాహిత్యంలో నోబెల్ బహుమతి లభించిందని, నోబెల్ బహుమతి అందుకున్న మొట్టమొదటి ఆసియా వాసి అని,ఈయన బాల్యంలోనే అనేక పద్యాలు,వ్యాసాలు ప్రచురించారని విపులంగా విద్యార్థిని విద్యార్థులకు అర్థమయ్యే రీతిగా తెలియపరచి, బాల,బాలికలను చదివిన విభాగంలోని కొన్ని ప్రశ్నలు అడిగారు. అనంతరం మల్లిక్ చెప్పిన పిల్లల హాస్య కథలు లోని "అక్బర్-బీర్బల్ "పుస్తకంలోని"అపాయంలో ఉపాయం" అనే కథను విద్యార్థులచే చదివించడం, పుస్తక పఠనం చేయించారు. విద్యార్థిని విద్యార్థులకు వ్యాయామంలో భాగంగా "షటిల్ ఆట"నేర్పించి ఆడించారు. ఈ కార్యక్రమంలో 28 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి దుగ్గిపోగు జాన్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమ అనంతరం విద్యార్థిని విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు.

అభివృద్ధి (1వ పేజీ తరువాయి)

కార్యక్రమాలకు తోడు మరిన్ని అభివృద్ధి పనులు జరగాలన్నదే తన లక్ష్యమన్నారు. ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించేందుకు నియోజకవర్గం నాలుగు మండలాల్లో 5 వేల ఎకరాల చొప్పున డెమో ప్లాట్లు వేసేందుకు భూమి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. నియోజకవర్గంలో మార్గంలేని స్మశానవాటికలకు స్థలం గుర్తించి జాబితాలను సిద్ధం చేయాలని సూచించారు. గుండుగొలను నుంచి ఏలూరు గోదావరి కాలువ చివరి వరకు కొంతమేర పూడికతీసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. చినుకులు పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారని,ధాన్యం కాపాడుకునేందుకు అన్ని రైతు సేవాకేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన,తదితర శాఖల ద్వారా అమలవుతున్న ఆయా పథకాల వివరాలను ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో జనుము,జీలుగ గ్రీన్ మెన్యూర్ సంబంధించి 10 వేల మెట్రిక్ టన్నులు కేటాయించగా ఇప్పటికే 4వేల మెట్రిక్ టన్నులు జిల్లాకు అందాయని మిగిలినవి కూడా వారం రోజుల లోపు రానున్నాయన్నారు. ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించేందుకు జిల్లాలో చర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి,జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఏలూరు ఆర్డిఓ అచ్యుత్ అంబరీష్,సిపిఓ వాసుదేవరావు, డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, జెడ్పి సిఇఓ కె. భీమేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్ భాషా,పశుసంవర్ధకశాఖ జెడి గోవిందరాజులు, ఏపిఎంఐపి పిడి రవికుమార్, జిల్లా గృహనిర్మాణశాఖ అధికారి సత్యనారాయణ,డ్వామా పిడి కె.వి. సుబ్బారావు, ఏపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి. సాల్మన్ రాజు, డిఇఓ యం. వెంకటలక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో మాక్‌డ్రిల్

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: మండల కేంద్రం ఆగిరిపల్లి గ్రామంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు మాక్ డ్రిల్ గురువారం నిర్వహించారు. ఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు ఈ డ్రిల్ చేపట్టారు. పాకిస్తాన్ తో యుద్ధ వాతావరణం నేపథ్యంలో స్థానికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు (1వ పేజీ తరువాయి)

గవర్నర్ చేతుల మీదుగా అవార్డును అందుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. రెడ్ క్రాస్ కష్టకాలంలో ఉన్నవారికి సహాయం చేయడం మనందరికీ తెలిసిందేనన్నారు. రెడ్ క్రాస్ మార్గనిర్దేశం చేయడానికి కొన్ని ముఖ్యమైన నియమాలను పాటిస్తూ, ఎల్లప్పుడూ అందరితో దయగా ఉండటం, స్వతంత్రంగా ఉండటం, స్వేచ్ఛగా తమ సమయాన్ని అందించే స్వచ్ఛంద సేవకులపై ఆధారపడటం, ఒక పెద్ద బృందంగా కలిసి పనిచేయడం, ప్రతిచోటా ప్రజలకు సహాయం చేయడానికి అందుబాటులో ఉండటం జరుగుతుందన్నారు. వరదలకు కొన్ని రోజుల ముందే తాను విధుల్లో చేరానని, అది నిజంగా తనకు సవాలుతో కూడుకున్నదని గుర్తు చేసుకున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి అక్కడి వాస్తవ పరిస్థితులను ముందుగా తెలుసుకోవాలనుకోవడంతో ఆ పరిస్థితిని సవాలుగా స్వీకరించి, వివిధ మార్గాల ద్వారా మారుమూల ప్రాంతాలకు కూడా చేరుకున్నానన్నారు. అక్కడ పరిస్థితులు హృదయ విదారకంగా ఉన్నాయని, ప్రజల తక్షణ అవసరాలు ఎక్కువ స్థాయిలో ఉన్నాయన్నారు. ప్రభుత్వం, రెడ్ క్రాస్ సొసైటీ, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక స్వచ్ఛంద సేవకులు, చుట్టుపక్కల ఉన్న ప్రతి ఒక్కరి సమన్వయంతో చేసిన ప్రయత్నంతో విస్తృత చర్యలు చేపట్టి పరిస్థితులను చక్కదిద్దినట్టు పేర్కొన్నారు. ఈ అవార్డు ప్రాతినిధ్యం వహిస్తున్న విలువలను నిలబెట్టుకుంటూ, తాను సేవ చేసే అదృష్టం ఉన్న వ్యక్తుల జీవితాలపై సానుకూల, శాశ్వత ప్రభావాన్ని చూపడానికి కృషి చేస్తూ అవిశ్రాంతంగా పనిచేస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు.

కర్తవ్యం (1వ పేజీ తరువాయి)

దాఖలు చేయాలన్నారు. ప్రతి రోజు వాహనాలు తనిఖీలు నిర్వహించి గంజాయి వంటి మత్తు పదార్థాలు అక్రమ రవాణాను అరికట్టాలని తెలిపారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ, త్వరితగతిన కేసుల దర్యాప్తును పూర్తి చేసేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ముందుగా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి.. బొకే ఇచ్చి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి. భీమారావు, డీఎస్పీలు, ఆర్.జయసూర్య, జి.శ్రీ వేద, డి.విశ్వనాథ్, ట్రైనీ డీఎస్పీ కె.మానస, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీ వి.పుల్లారావు, డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, ఆర్మ్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ (అడ్మిన్) డి.సురేష్ ఆర్మ్ రిజర్వ్ ఇన్స్పెక్టర్, కె.వెంకట్రావు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలు (1వ పేజీ తరువాయి)

చేశారు. ఏలూరు జిల్లాలో కేవలం 2427,పశ్చిమగోదావరి జిల్లాలో 587 మట్టి నమూనాలను పరీక్షించారు. ఆయా పరీక్షల ద్వారా సూక్ష్మ పోషకాలను నిర్ధారించి లోపాలు ఉంటే ఆ దిశగా చర్యలు తీసుకోనున్నారు. రైతులు కూడా భూసార పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు కోరుతున్నారు. నేల ఆరోగ్యం, పోషక సామర్థ్యాన్ని బట్టి ఎరువుల వాడకం తెలుసుకోవచ్చు అంటున్నారు. పంటల దిగుబడి సరిగా లేకపోవడం,సూక్ష్మ పోషకాల వంటి సమస్యలను పరీక్షల ద్వారా గుర్తించి వాటిని నివారణకు వ్యవసాయ అధికారులు సూచన చేస్తారు.

ఈ పరీక్షలు చేస్తారు....

నేలలో ప్రధాన పోషకాలైన ఉదజని సూచికతో పాటు మట్టి పరీక్షల ద్వారా ఆమ్ల,క్షార లవణాల స్థాయి (పిహెచ్) తోపాటు ఫాస్పరస్, పొటాషియం,ఆర్గానిక్ కార్బన్, సల్ఫర్, జింక్, ఐరన్, కాపర్,బోరాన్, మెగ్నీషియం నేలలో ఏ మోతాదులో ఉన్నాయో పరీక్షల ద్వారా గుర్తిస్తారు. ఆయా నేలలోని లోపాల ఆధారంగా వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు పోషకాలు వాడకం..పంటల సాగుకు సంబంధించిన సూచనలు సలహాలు ఇస్తారు.

గత ఏడాది లోపాలు ఇలా...

గత ఏడాది నిర్వహించిన భూ పరీక్షల్లో ఏలూరు జిల్లాలో నత్రజని ఆర్గానిక్ కార్బన్ తక్కువగా ఉన్నట్లు తేలింది.పలు ప్రాంతాలలో జింక్ ఐరన్ ఫాస్పరస్ మోతాదు తక్కువగా నిర్ధారించారు.

పరీక్షలు సరే... పోషకాల పంపిణీ?

సూక్ష్మపోషకాల లోపంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. జింక్, మెగ్నీషియం, గంధకం, ఇనుము, మాంగనీస్, రాగి, భాస్వరం, నత్రజని, పొటాషియం వంటి సూక్ష్మ పోషకాలు పంటలకు అవసరం. గతంలో టిడిపి ప్రభుత్వం సూక్ష్మ పోషకాలను రాయితీపై రైతులకు అందించింది. వైసీపీ ప్రభుత్వం సూక్ష్మ పోషకాల పంపిణీని నిలిపివేసింది. దీంతో రైతులు ఐదేళ్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక గత ఏడాది సూక్ష్మ పోషకాలను పంపిణీ చేయలేదు.సూక్ష్మ పోషకాల వల్ల కలుగుతున్న నష్టాన్ని నివారించుకోవడానికి రైతులు వ్యాపారులను ఆశ్రయించి దోపిడీకి గురవుతున్నారు.ఈ పరిస్థితులలో భూసార పరీక్షలతో పాటు సూక్ష్మ పోషకాలను రాయితీపై అందించాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా విశ్వకవి జయంతి

విశాలాంధ్ర -భీమవరం: విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి డీఎన్నార్ కళాశాల సెంట్రల్ లైబ్రరీలో నిర్వహించి ఆయనకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డిఎన్నార్ విద్యా సంస్థల అధ్యక్షుడు గోకరాజు నరసింహరాజు, సెక్రటరీ కరస్పాండెంట్ గాదిరాజు బాబు, ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, ప్రిన్సిపాల్ జి.మోజెస్, పాలకవర్గం సభ్యులు ఎ.సురేంద్ర, దంతులూరి గోపి, గ్రంథాలయాధికారి ఎం.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మెండైన ప్రయోజనాలు

విశాలాంధ్ర -భీమవరం: యోగాతో మెండైన ప్రయోజనాలు ఉన్నాయని చిన్నారులు బాల్యం నుంచే యోగాసనాలపై ఆసక్తి పెంచుకోవాలని ఆంధ్రోపన్యాసకులు కలిగొట్ల గోపాలశర్మ అన్నారు. శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యము అని విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలంటే మానసిక, శారీరక ఆరోగ్యం ముఖ్యం అన్నారు. కార్యక్రమంలో తెలుగు కలిగొట్ల గోపాలశర్మ, ఎం.డి.సరోజిని, జె.శ్యామ్ తదితరులు విద్యార్థులకు నీతి కథల మూలం, వాటి సారాంశం, భగవద్గీత శ్లోకాలు, పుస్తక పఠనం, నృత్యంపై తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి యస్.వెంకటేశ్వరరావు , సిబ్బంది, చదువరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు

విశాలాంధ్ర - నరసాపురం: రెడ్ క్రాస్ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా పలు సేవాకార్యక్రమాలు చేస్తుందని రిసోర్స్ పర్సన్, శాస్త్రవేత్త సుబ్బారావు అన్నారు. నరసాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులలో అంతర్జాతీయ రెడ్ క్రాస్ డేను పురస్కరించుకుని గురువారం ఆ సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాల పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైఎన్ కళాశాల హెచ్ ఆర్డీ డాక్టర్ చినిమిల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్స్ పై అవగాహన కల్పించారు. రాజేంద్ర జ్యువెలరీ షాపు అజిత్ కుమార్ జైన్ పిల్లలకు స్నాక్స్ అందజేశారు.కార్యక్రమంలో సూర్యం బాబు, గెల్లి శ్రీనివాస్ పలు అంశాలలో శిక్షణ ఇచ్చారు.కార్యక్రమాలను లైబ్రేరియన్ కెజి ఎస్ ఎల్ కుమారి పర్యవేక్షించారు.

విద్యార్థులు చరవాణికి దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - కలిదిండి: విద్యార్థిని విద్యార్థులు చరవాణి కి దూరంగా ఉండాలని తహసీల్దార్ ఎల్. వి ఎస్ రామకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక శాఖ గ్రంథాలయాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరం సద్వినియోగం చేసుకోవా లని సూచించారు. టీవీలకు, చరవాణిలకు దూరంగా ఉండాలని అతిగా వినియోగించడం వల్ల అనేక నష్టాలు కలుగుతాయి అని అన్నారు. విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవడం వల్ల అనేక ప్రయోజనా లుంటాయని తెలిపారు.గ్రంథాలయంలో పుస్తక పఠనము, పుస్తక సమీక్ష, హిందీ వ్యాకరణం, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ అధికారి జె.రమేష్ బాబు, సిబ్బంది పురుషోత్తం, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో వర్షం

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: ఆగిరిపల్లి గ్రామ పరిసర ప్రాంతాలలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గడచిన రెండు రోజులుగా ఎండలు విపరీతంగా ఉండటంతో ప్రజలు ఉక్క పోత తో ఇబ్బందులకు గురయ్యారు. నేడు వాతావరణం లో ఒక్కసారిగా మార్పులు వచ్చి వర్షం కురవడం తో మొత్తం గ్రామం, గ్రామ పరిసరాలు చల్లబడింది. వర్షాలు, ఈదురు గాలుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

గాయాలతో బయటపడ్డ వాహనదారులు

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని వేగవరం గ్రామం వద్ద తల్లాడ, దేవరపల్లి జాతీయ రహదారిపై గురువారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఖమ్మం నుండి రాజమండ్రి వైపు కంటైనర్ లారీ వస్తుండగా, అశ్వరావుపేట వైపు వెళ్ళే

ఆయిల్ లోడు లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో రహదారి పక్కన ఆపి ఉన్న మోటార్ బైక్‌ను కూడా ఢీ కొట్టినట్లు తెలిపారు. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. చిన్న గాయాలయ్యాయని, బైక్ దారులు బండి వద్ద లేకపోవడంతో ప్రమాద ఘటన తప్పిందని, గాయాలైన వారిని దగ్గర్లో ఆసుపత్రికి తరలించినట్లు వేగవరం వీఆర్ఓ డి.వి రాజు తెలిపారు. ఢీ కొట్టిన కంటైనర్ లారీ రహదారి కుడివైపుకు బోల్తా పడిందని అన్నారు.

తలసేమియా నివారణకు కృషి

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : తల సేమియా వ్యాధిని బాధితులకు పూర్తిస్థాయిలో నివారించే విధంగా కృషి చేస్తున్నామని భీమవరం ఏ ఎస్ ఎన్ రాజు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఏ ఎస్ ఎన్ రాజు అన్నారు, గురువారం ఆ సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన

విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తల సేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ఉచిత వైద్యం అందిస్తున్నామని తెలిపారు. ముందుగా తమ ట్రస్టులో డాక్టర్ చంద్రశేఖర్ వర్మ వారి బృందంతో తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు పరీక్షలు నిర్వహించి వారికి ముందస్తుగా ఏ విధమైన ట్రీట్మెంట్ అవసరమో తెలుసుకుని, అడ్వాన్స్ గా ప్లేట్లెట్స్ డౌన్ అయిపోయిన పిల్లలకు ప్లేట్లెట్స్ ఎక్కించడం, రక్తహీనతతో ఉన్న పిల్లలకు రక్తాన్ని అందించడం, మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. అనంతరం క్రిటికల్‌గా ఉన్న చిన్నారులకు చెన్నై వైద్యాలయానికి తరలించి వైద్యం అందించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు, వారికి బోన్మేరో ట్రాన్స్ ప్లాంటేషన్ ద్వారా శాశ్వత పరిష్కారం చేసే దిశగా మా సంస్థ కృషి చేస్తుందని ఆయన తెలిపారు, అలాగే మా దగ్గర ప్రతి నెల 20 నుండి 30 మంది చిన్నారులు వైద్యం పొందుతున్నారని ఆయన తెలిపారు.

పత్రికా కార్యాలయాలు, ఎడిటర్ల ఇళ్ల పై దాడులు కక్ష సాధింపు చర్య

విశాలాంధ్ర-చింతలపూడి: కూటమి ప్రభుత్వంలో రాను రాను రాష్ట్రంలో జర్నలిస్ట్ లు,పత్రికా కార్యాలయాలు, ఎడిటర్లు పై దాడులు పెరిగాయని,ప్రభుత్వం ఇటువంటి వాటి వి జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ వైస్ ప్రెసిడెంట్ ఎ.ఐ అజాద్ కోరారు.సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటి పై పోలీసులు ఎటువంటి ముందస్తు నోటీసు లు ఇవ్వకుండా సోదాలు జరపడం పట్ల ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఖండిస్తుందని అన్నారు. జర్నలిస్ట్‌లు,పత్రికా కార్యాలయ లు పై దాడులు జరుగుతున్నాయని, పత్రికా స్వేచ్ఛను అణగదొక్కాలని చూస్తున్నారని అజాద్ అన్నారు. ఈ సందర్భంగా పత్రికా కార్యాలయాలు, జర్నలిస్ట్ ల పై దాడులు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ చింతలపూడి సి ఐ రాజశేఖర్ కు ప్రెస్ క్లబ్, ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ తరు పున వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సాక్షి సీనియర్ జర్నలిస్ట్ - అమీర్ పాషా, పాత్రికేయులు మోగపర్తి కృపావరం, సంజయ్,బాలు, తదితరులు పాల్గొన్నారు.

బోరవంచ రైతులకు చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర -నూజివీడు టౌన్: పోరాటాల ద్వారా సమస్యలు పరిష్కారం జరుగుతుందని సిపిఐ రాష్ట్ర సమితి నాయకులు చలసాని వెంకట రామారావు అన్నారు. నూజివీడు మండలం బోరవంచ గ్రామంలో న్యూ జెన్ సీడ్ మొక్కజొన్న సాగు చేసిన బాధిత రైతులకు కంపెనీ ఆర్గనైజర్లు గురువారం అందజేసిన 15 మంది రైతులకు 9 లక్షల రూపాయల చెక్కులను రామారావు స్థానిక అమర్‌భవన్‌లో రైతులకు పంపిణీ చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ , రైతు సంఘం పోరాట ఫలితంగా బోరవంచ రైతులకు న్యాయం జరిగిందన్నారు. ప్రభుత్వం, వ్యవసాయ అధికారులు సరైన పర్యవేక్షణ లేకపోవడం చేత సీడ్ కంపెనీల ఆర్గనైజర్లు స్థానిక రాజకీయ నాయకుల అండతో రైతులను నష్టపరుస్తున్నారన్నారు. బోరువంచ రైతులు ఐక్యంగా ఉండడం చేత సంబంధిత సీడ్ కంపెనీ యాజమాన్యం డబ్బులు చెల్లించారన్నారు. సిపిఐ నాయకులు నిమ్మగడ్డ నరసింహ మాట్లాడుతూ వచ్చే సీజన్లో రైతులు కచ్చితంగా



ఆయా సీడ్ కంపెనీలతో ఒప్పంద పత్రం రాసుకోవాలని సూచించారు. రైతులకు చెల్లించవలసిన మిగతా నష్ట పరిహారం వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.లక్ష్మణరావు, మదుపల్లి నాగేంద్రరావు, యదాల సురేష్, బుక్య రంగారావు, బొప్పుడి రాంబాబు రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టంలో సమస్యలు తక్షణమే పరిష్కారం చేయాలి

విశాలాంధ్ర -పెంటపాడు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కార దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు ప్రభుత్వాన్ని కోరారు.

గురువారం పెంటపాడు మండలం చింతపల్లి ,ముదునూరు, రాచర్ల గ్రామాలలో పని ప్రదేశాలలో ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కూలీలు పని ప్రదేశంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఎండ తీవ్రత తట్టుకోవడానికి టెంట్ హౌస్ లేకపోవడం, ప్రాథమిక చికిత్సకు సంబంధించిన మెడికల్ కిట్లు లేకపోవడం, పనిముట్లు కేటాయించకపోవడం, సమ్మర్ అలవెన్స్ నిధులు ఇవ్వకపోవడం, పనిచేసిన శ్రామికులకు బకాయిలు సకాలంలో ఇవ్వకపోవడం ఇతర సమస్యలు వలన కార్మికులు తీవ్ర ఆర్థిక పరిస్థితులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సంవత్సరానికి 365 రోజులుకు నెలరోజులు కూడా ఉపాధి కూలీ పని కల్పించడం లేదని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో సంఘం తాడేపల్లిగూడెం నియోజవర్గ నాయకులు దిద్దే నాగేశ్వరరావు, రాజు,కే శ్రీనివాస్, ఆ గ్రామాల కూలీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వెలుగు వివోఏల సంఘ నాయకుల ఆందోళన

విశాలాంధ్ర-లింగపాలెం: వెలుగులో పనిచేస్తున్న వివోఏలను అన్యాయంగా తొలగించారని దీనిపై12 రోజులుగా నిరసన దీక్ష చేస్తున్న వివోఏల సమస్యలను పట్టించుకోకపోవడం పట్ల వీరంతా బుధవారం లింగపాలెం తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన దీక్ష చేపట్టారు.రాజకీయ ఒత్తిడిలకు, ప్రలోభాలకులోబడి వెలుగు అధికారులు పనిచేస్తున్నారని వివోఏ ఉద్యోగుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే సుభాషిణి ఆరోపించారు. లింగపాలెం మండలంలో అన్యాయంగా 11 మంది వివోఏలను తొలగించారని తెలిపారు. వీరిలో సింగగూడెంకు చెందిన వివోఏ మనోవ్యాధితో మృతి చెందిందని ఈ మృతి పై విచారణ చేయాలని పట్టు పట్టినా అధికారులు చలనం లేనట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. వీరంతా మండుటెండను సైతం లెక్కచేయ కుండా తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన

చేశారు. తొలగించబడిన వివోఏ లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాల యానికి తనిఖీకి వచ్చిన నూజివీడు రెవెన్యూ డివిజన్ సబ్ కలెక్టర్ స్మరణరాజును కలిసి ఆందోళన చేస్తున్న నాయకులు వివోఏ లకు జరిగిన అన్యాయాన్ని వివరించి న్యాయం జరిపించాలని కోరారు. ఈయనకు వీరంతా లిఖితపూర్వకంగా వినతిపత్రం అందించారు. వివోఏలు చేస్తున్న నిరసన దీక్షకు సిఐటియు నాయకులు మద్దతు పలికారు. ఆందోళనలో ప్రసాద్, నారాయణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీమాను చేయించుకోవడం భారం అనుకోవద్దు

ఎస్.బి.ఐ రీజనల్ మేనేజర్ సూచన

విశాలాంధ్ర-లింగపాలెం: బీమా చెల్లించడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఎస్.బి.ఐ రీజనల్ మేనేజర్ ఎన్. ఎల్.వి.వి ప్రసాద్ తెలిపారు. ధర్మాజీ గూడెం ఎస్.బి.ఐ బ్రాంచిలో చంద్రు ప్రవీణ్ కుమార్ అనే యువకుడు వ్యక్తిగత ప్రమాద బీమా

రూ.500 చెల్లించిన కొద్ది రోజులకే రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో ఆ కుటుంబానికి రూ.10 లక్షలు బీమా రావటంతో నగదును మృతుని తల్లి రాజకుమారికి రీజనల్ మేనేజర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ధర్మాజీగూడెం బ్రాంచ్‌కి వచ్చిన ప్రసాద్ ఇన్సూరెన్స్ చేయించు కోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. వివిధ రకాల ఇన్సూరెన్స్ స్కీములు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని వీటిని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. పీఎం జనజీవన యోజన,సురక్ష భీమా యోజన,వ్యక్తిగత జీవనజ్యోతి ప్రమాద భీమాలు గురించి ఈయన వివరించారు. ఏడాదికి రూ. 20 నుంచి రూ.2 వేలు చెల్లించే పథకాలు ఉన్నాయని తెలిపారు. ఇన్సూరెన్సు చేయించు కోవడం వల్ల అనుకోని ప్రమాదాలు జరిగితే ఎంతో ప్రయోజనం కలుగుతుందని వివరించారు. 18 ఏళ్ల వయస్సు నుంచి60,70 ఏళ్ళ వయస్సు ఉన్నవారికి ఇవి వర్తిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మాజీగూడెం ఎస్.బి.ఐ బ్రాంచి మేనేజర్ రజనీకాంత్,వెలుగు ఏపిఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బుర్రకథ కళాకారుడు బాబూరావుకు నివాళులు

విశాలాంధ్ర- కామవరపుకోట: ప్రముఖ బుర్రకథ కళాకారుడు విభూది బాబూరావు ఐదవ వర్ధంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సీనియర్ బుర్రకథ కళాకారుడు సబ్బి కనకారావు, ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ బుర్రకథ కళాకారుడు టీవీఎస్ రాజు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాబూరావు బుర్రకథ కళాకారునిగా ఖ్యాతి గడించి వేలాదిమంది ప్రేక్షకుల ఆశీస్సులు పొంది అతి చిన్న వయసులోనే బుర్రకథ కళా కుటుంబానికి దూరం అవటం దురదృష్టకరం అన్నారు.బుర్రకథ కళాకారులు వీరమల్ల సత్యనారాయణ, బొచ్చు నందకుమార్, సీనియర్ జానపద కళాకారుడు చిలుకూరి సుబ్బయ్య చారి,కవి, రచయిత తిప్పాబట్ల రామకృష్ణ, రంగస్థలం కళాకారుడు తిరుపతి రమేష్,బాబు కళాభిమానులు సాయన రాఘవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కనకరాజు,సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ వీరమల్ల మధు తదితరులు బాబూరావుకు నివాళులర్పించారు.

విపత్తుల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై నేడు శిక్షణ

విశాలాంధ్ర- పాలకోడేరు : పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం పాలకోడేరు మండలంలోని మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులకు ముఖ్యంగా గ్రామ క్షేత్రస్థాయిలో ఉండే గ్రామ సచివాలయ సిబ్బందికి, ఉపాధి హామీ సిబ్బందికి,

వెలుగు సిబ్బందికి రాబోయే వర్షాకాలంలో సంభవించే విపత్తులైన పిడుగులు, ఉరుములు, మెరుపుల మేఘ విస్ఫోటనం, వరదలు, తుఫాన్ల సమయంలో ఎక్కువ మరణాలు సంభవించడం, ఆస్తి నష్టం వాటిల్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున ఆ సమయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు శుక్రవారం ఆన్లైన్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో వి.రెడ్డయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ ఆన్లైన్ శిక్షణ కార్యక్రమంలో సంబంధిత మండల, గ్రామస్థాయి అధికారులు కచ్చితంగా పాలు పంచుకోవాలని లేని పక్షంలో శాఖాపరమైన క్రమ శిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈశిక్షణ కార్యక్రమం మూడు బృందాలుగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. శిక్షణ పొందిన సిబ్బంది అందరూ గ్రామస్థాయిలో ప్రజా ప్రతినిధులు, గ్రామ స్తులతో అవగాహన కార్యక్రమం నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు.

ఆదర్శ రైతు మంత్రి నిమ్మల రామానాయుడు

- దాళ్వాలో ఎకరానికి 65 బస్తాల అధిక దిగుబడి
- సొంత పొలం సాగులో మంత్రికి అద్భుత ఫలితాలు

విశాలాంధ్ర - పాలకొల్లు: రైతు బిడ్డగా వ్యవసాయం గురించి, రైతుల కష్టాల గురించి సమస్తం తెలిసిన మంత్రి రామానాయుడు, నేడు ఆదర్శ రైతుగా నిలిచారు. ఆయన సొంత పొలంలో దాల్వా వరి సాగులో ఎకరానికి 65 బస్తాలు అధిక దిగుబడులు సాధించి తనకు

తానే సాటి అని నిరూపించుకున్నారు. అతి తక్కువ పెట్టుబడులతో యాజమాన్య పద్ధతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలతో మంత్రి అధిక దిగుబడి సాధించినట్లు పాలకొల్లు వ్యవసాయ సహాయ సంచాలకురాలు అద్దాల పార్వతి, పాలకొల్లు మండల వ్యవసాయ అధికారి కె. రాజశేఖర్ తెలిపారు. పాలకొల్లు వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇరువురి వివరాలను వెల్లడించారు. పాలకొల్లు మండలం ఆగర్తి పాలెం గ్రామంలో మంత్రి రామానాయుడు తన ఆరు ఎకరాల విస్తీర్ణంలో వరి పి.ఆర్ 126 సన్న రకం (గ్రేడ్ ఏ) దాల్వా సాగు చేశారు. ఎకరానికి 65 బస్తాలు చొప్పున ఆరెకరాల్లో 390 బస్తాలు దిగుబడి సాధించారు మంత్రి రామానాయుడు. అతి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందారు. సకాలంలో నారు పోసి నాట్లు వేయడం, ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులు, పురుగులు, తెగుళ్ల నివారణ చర్యలు, నీటి ఎద్దడి లేకుండా ఎప్పటికప్పుడు మురుగునీరు బయటికి తీసి పిలక దశలో చేసును ఆరబెట్టడం ద్వారా పైరు,వేర్లకు గాలి, వెలుతురు బాగా తగలడం, అధికంగా పిలకలు మొలవడం వంటివి అధిక దిగుబడులకు సాధ్యమైంది. మరీ ముఖ్యంగా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు సలహాలను ఎప్పటికప్పుడు పాటిస్తూ అధిక దిగుబడులతో మంచి ఫలితాలు సాధించారు. ప్రతి రైతు ఈ విధంగా వ్యవసాయంలో ప్రత్యేకమైన శ్రద్ధను కనపరిస్తే మంచి దిగుబడులు పొందవచ్చునని ఏడీఈ పార్వతి, ఏడి రాజశేఖర్ లు తెలిపారు. ఆదర్శ రైతుగా నిలిచిన మంత్రి రామానాయుడు ను వ్యవసాయ శాఖ తరపున ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు పార్వతి తెలిపారు.

సమ్మె నోటీసు అందజేత

విశాలాంధ్ర -భీమవరం: పాలకులు అవలంబిస్తున్న ఉద్యోగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీ యూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగా రావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం భీమవరంలో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డికి కార్మిక సంఘాల జెఎసి నాయకులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ పర్మినెంట్ కార్మికుల పెండింగ్లో ఉన్న 6 డీఏలు విడుదల చేయాలని, మున్సిపల్ విభాగంలోని ఇంజనీరింగ్ కార్మికుల వేతనాల పెంపుకై గత ప్రభుత్వంలో నియమించిన కమిటీ నివేదికల ఆధారంగా వేతనాలను పెంచి ఇవ్వాలని, మున్సిపల్ ఉద్యోగ, కార్మికులకు పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవు ఎన్‌క్యాష్‌మెంట్ సత్వరం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ విభాగంలో ఔట్సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని, మున్సిపల్ రంగంలో డ్రైనేజ్ కార్మికులను, విక్లాస్ కార్మికులను, నగర దీపికలను ఔట్సోర్సింగ్‌లోకి తీసుకోవాలని, పెరుగుతున్న జనాభా కనుగుణంగా కార్మి కుల సంఖ్యను పెంచాలన్నారు. కార్యక్రమంలో జెఏసి నాయకులు బి.వాసుదేవరావు, కె.మహంకాళి, మునియ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రెడ్‌క్రాస్ దినోత్సవం

విశాలాంధ్ర -ఏలూరు: ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం, ప్రపంచ తలసేమియా దినోత్సవం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించినట్లు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ మాగంటి ప్రసాద్ తెలిపారు. ముందుగా రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ విగ్రహానికి డాక్టర్ మాగంటి ప్రసాద్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాగంటి ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్న అతిపెద్ద మానవతావాద సంస్థ రెడ్ క్రాస్ సొసైటీ అన్నారు. సుమారు 1 కోటి 60 లక్షల మంది రెడ్ క్రాస్ వాలంటీర్లు,సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. జిల్లాలోని రెడ్ క్రాస్ సేవలను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సహకారంతో మరింత విస్తృతం చేస్తామని, ప్రతి మండలంలోనూ రెడ్ క్రాస్ సబ్ బ్రాంచిలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తల సేమియా సికిల్ సెల్ ఎనిమియా వ్యాధి చిన్నారులకు అవసరమైన రక్త పరీక్షలను రెడ్ క్రాస్ ల్యాబ్‌లో చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. బ్లడ్ బ్యాంకులో రక్త నిల్వలను పెంచి తలసేమియా,సికిల్ సెల్ ఎనిమియా చిన్నారులకు ఎక్కువ మందికి రక్త మార్పిడి జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజన ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించేలా 2025 - 26 సంవత్సరంలో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను పెద్ద ఎత్తున జూనియర్,యూత్ రెడ్ క్రాస్ విభాగాలలో నమోదు చేయిస్తామన్నారు. అనంతరం బ్లడ్

సెంటర్లోని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, రెడ్ క్రాస్ వాలంటీర్లతో ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఫైర్ స్టేషన్ మీదగా రెడ్ క్రాస్,తల సేమియా వ్యాధిపై అవగాహన ర్యాలీని నిర్వహించారు.రెడ్ క్రాస్ రక్తమార్పిడి కేంద్రంలోని రక్త మార్పిడి చికిత్స పొందుతున్న 15 మంది తలసేమియా చిన్నారులకు పండ్లను,ప్రోటీన్ పౌడర్లను పంపిణీ చేశారు.కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ జె.సత్యనారాయణ రాజు, ట్రెజరర్ ఎన్.బ్రహ్మానందం, డాక్టర్ వరప్రసాదరావు, కమిటీ సభ్యులు అలపాటి నాగేశ్వరరావు, మునగాల మురళీకృష్ణ, ఎంవివి నాగేశ్వరరావు, మోటేపల్లి చంద్రశేఖర్, కొత్తగుండు శ్రీనివాస్, పెను మత్స శ్రీరామరాజు, బొల్లా లక్ష్మీనారాయణ, మానవత సభ్యులు, రెడ్ క్రాస్ ఏఎన్ఎం విద్యార్థినీలు, సిఆర్ రెడ్డి ఫార్మసీ, నర్సింగ్ విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

వాహన యజమానులు త్రైమాసిక పన్ను చెల్లించాలి

- రవాణా వాహనాలపై 115 కేసులు నమోదు
- రూ.7.53 లక్షల అపరాధ రుసుము

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: రవాణా వాహనాలకు చెల్లించ వలసిన పన్ను గడువు ఏప్రిల్ 30వ తేదీతో ముగిసినప్పటికీ, కొందరు రవాణా వాహన యజమానులు త్రైమాసిక పన్ను చెల్లించకుండా వాహనాలను

రహదారులపై తిప్పుతున్నారని డీటీసీ షేక్ కరీమ్ తెలిపారు. ప్రత్యేక తనిఖీల్లో భాగంగా ఈ నెల ఒకటవ తేదీ నుంచి నేటి వరకు రవాణా వాహనాలపై 115 కేసులు నమోదు చేసి, 7.53 లక్షల రూపాయలను అపరాధ రుసుముగా విధించినట్లు ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ అన్నారు.

జిల్లాలోని వాహన తనిఖీ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తద్వారా పన్ను చెల్లించని రవాణా వాహనాలపై అపరాధ రుసుము విధించడంతో పాటు వాహనాన్ని సీజ్ చేస్తామని ఆయన అన్నారు. వాహనంపై కేసు నమోదు చేస్తే పన్నుతో పాటు 200 శాతం అదనంగా చెల్లించాల్సి వస్తుందని, స్వచ్ఛందంగా పన్ను చెల్లిస్తే పన్నుతో పాటు 50 శాతం మాత్రమే అదనంగా చెల్లిస్తే సరిపోతుందని కరీమ్ అన్నారు.

ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, రవాణా వాహనాలకు క్రమం తప్పకుండా టాక్స్, భీమా చెల్లిస్తూ, పర్మిట్, పొల్యూషన్, ఫిట్నెస్ ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలని వాహన యజమానులను కోరారు. ఈ తనిఖీలలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్‌లు జగదీష్, నెహ్రూ, ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం రూరల్ : చింతలపూడి నియోజకవర్గ శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ గురువారం పట్టణంలో పర్యటించారు. జంగారెడ్డిగూడెంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పట్టణంలో పేరంపేట రోడ్డులో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ క్లినిక్ కాంపౌండ్ హాల్ కు ఆయన శంకుస్థాపన చేశారు. ఆయనతోపాటు కూటమి నాయకులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీస్

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా మేడిచర్ల, బాపులపాడు మండలం, కృష్ణాజిల్లా వాస్తవ్యులైన శ్రీ కాలతోటి ఏసుపాదం, తండ్రి: ఆనందరావు తనకు చెందిన కృష్ణాజిల్లా, నూజివీడు సబ్-రిజిస్ట్రీ, బాపులపాడు మండలం, మేడిచర్ల పంచాయితీ, మేడిచర్ల గ్రామం నందలి ఆర్.ఎస్.నెం.325-7, డో.నెం.57-A లో గల 228 చ.అ.ల ఆర్.సి.సి. బిల్డింగ్ హద్దులు తూర్పు:శ్రీకాలతోటి ఏసుపాదంకు చెందిన స్థలం ; దక్షిణం: తెనాలి బాలస్వామి మరియు ఇతరులకు చెందిన స్థలం ; పడమర : పంచాయితి రోడ్ ; ఉత్తరం : 12 అ.ల. వెడల్పుగల జాయింట్ రహదారి ఈ హద్దుల మధ్యగల 189.46 చ.గ.ల స్థలం ఆర్.సి.సి.బిల్డింగ్‌తో సహాగల ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులను మా ఏలూరు శాఖ వద్ద తనఖా పెట్టి ఋణసౌకర్యమును పొందియున్నారు. తదుపరి ఋణమొత్తమును తిరిగి చెల్లించటంతో మేము శ్రీ కాలతోటి ఏసుపాదం లోన్ అకౌంట్‌ను మూసివేయడం జరిగింది. దానికి సంబంధించి శ్రీ కాలతోటి ఏసుపాదం అభ్యర్థన మేరకు MODT 2709/2022 కింద డిపాజిట్ చేయబడిన ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ సెటిల్‌మెంట్ డాక్యుమెంట్ నెం. 1119/2019 ("సెటిల్‌మెంట్ డీడ్") మినహా మిగిలిన అన్ని డాక్యుమెంట్స్‌ను వారికి అందజేయడం జరిగింది. మేము మా రికార్డ్సును పరిశీలించిన పిదప సదరు సెటిల్‌మెంట్ డీడ్ జాడను కనిపెట్టలేకపోయినాము. కాబట్టి పైన తెలుపబడిన డాక్యుమెంట్లు ఎవరికైన దొరికన యెడల ఈ క్రింది తెలుపబడిన చిరునామాకు పంపగలరు / తెలుపగలరు.

ప్రయాణ్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్

కొత్త నెం. 71ఏ/ పాత నెం.29, 2వ అంతస్తు, బర్కిట్ రోడ్, టి.నగర్, చెన్నై-600017,

ఇ-మెయిల్ : customercare@prayaancapital.com, ఫోన్: +91-4442303366

బినామీ మోసానికి తెగబడ్డ అధికారికి చేదు అనుభవం

- ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయంలో ఓ అధికారి నిర్వాకం
- మోసంతో స్వాహా చేద్దామని పన్నాగం అది కాస్తా వికటించి అడ్డంగా ఇరుక్కున్న వైనం

విశాలాంధ్ర- ఉంగుటూరు: బోల్తా కొట్టిందిరో బుల్ బుల్ పిట్ట అన్నాడో సినీ కవి. అచ్చం అలాగే జరిగింది ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయంలో ఓ అధికారి వ్యవహారం. అనుకున్నది ఒక్కటి అయింది మరొకటి. ఈ అధికారి గురించి మండలంలో ప్రజలు చర్చించు కుంటున్నారు. వివరాల్లోకి వెళితే.... ఉంగుటూరు మండలంలో గతేడాది సార్వత్రిక ఎన్నికలు జరిగిన సంగతి అందరికీ విదితమే. సుమారు 5 నెలల క్రితం అదనంగా ఎన్నికల ఖర్చులకు మళ్లీ లక్షలాది నిధులు వచ్చాయి. ఈ నిధులు అంతా ఖర్చు చేశామని బినామీ పేరుతో రసీదులు పెట్టి ప్రభుత్వాన్ని మోసం చేశాడు. మండలంలో ఓ వ్యక్తికి సుమారు రూ. 7 లక్షల 50 వేలు ఇవ్వాలని బినామీ పేరుతో అతని ఖాతాలో వేయించాడు. ఎవరైనా అధికారులు వస్తే ఎన్నికల ఖర్చులు నాకు ఇవ్వవలసిన డబ్బులు ఇచ్చారని ఆ బినామీ వ్యక్తికి ఈ అధికారి చెప్పారు. ఆ డబ్బులు అతని జమయి ఐదు నెలలు దాటింది. డబ్బులు పడిన నాటి నుంచి ఆ అధికారి నీకు పడ్డ డబ్బులు నాకు ఇవ్వమని అనేకసార్లు అడిగారు. బినామీ దారుడు ఆ అధికారి అలుసుగా తీసుకొని ఇస్తాను ఇస్తాను అంటూ కాలయాపన చేశారు. నెలలు దాటుతున్న ఎందుకు డబ్బులు ఇవ్వటం లేదని ఆ అధికారి గట్టిగా బినామీదారున్ని ప్రశ్నించగా ఆ డబ్బులు నాకు ఇవ్వాల్సినవి వచ్చాయి, నేను ఇవ్వను అంటూ మొండి సమాధానం చెప్పడంతో అధికారి షాక్ తిన్నాడు . దీంతో ఏం చేయాలో ఆ అధికారి తలలు బాదుకున్నాడు. నేను ప్రభుత్వానికి చేసిన మోసానికి నేనే మోసపోయాను అంటూ నిరాశ చెందాడు.

పోలీస్ స్టేషన్ దృష్టికి

తన ఎన్నికల సొమ్ము అతని ఖాతాలో జమ వేయించానని నా సొమ్ము ఇవ్వటం లేదని ఆ అధికారి చేబ్రోలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. బినామీ దారుడును పోలీస్ స్టేషన్ను తీసుకువచ్చారు. అక్కడ ఏమి జరిగిందో ఎవరికీ తెలీదు. అంతా గోప్యంగా ఉంచారని తెలిసింది.

కూటమి నాయకుడు చుట్టూ తిరిగిన అధికారి : పోలీస్ స్టేషన్లో ఏం చెప్పాడో ఆ అధికారి ఉంగుటూరులో కూటమి నాయకుడు దగ్గరకు వెళ్లి చెప్పటం జరిగింది. ఆ నాయకుడు ఇంటి చుట్టూ తిరుగుతున్నట్లు తెలిసింది.

ఉగ్రవాదం అంతమే మోదీ లక్ష్యం : ఎమ్మెల్యే జ్యోతుల

విశాలాంధ్ర - జగ్గంపేట : ఉగ్రవాదాన్ని అంతం చేయడమే ప్రధాని నరేంద్ర మోదీ పంతమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పాక్ ఉగ్రవాద స్థావరాలపై ఆపరేషన్ సింధూర్ పేరిట చేసిన దాడుల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్ విజయంతో భారతదేశ సైనికుల సత్తా ప్రపంచానికి మరోసారి తెలిసిందని అన్నారు. టెర్రరిస్టు స్థావరాలపై మన దేశ సైనికులు చేసిన దాడి దృశ్యాలను ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారని తెలిపారు. సింధూర్ దాడులతో ఉగ్రవాదులకు భారత్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసిందన్నారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, టిడిపి నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీనుమణి బాబు, అన్నవరం రిటైర్డ్ పిఆర్‌ఓ తుల రాము, బోదిరెడ్ల సుబ్బారావు, మండపాక అప్పన్న దొర, బందారు నాని పాల్గొన్నారు.

'సింధూర్'కి మద్దతుగా ర్యాలీ

విశాలాంధ్ర - జగ్గంపేట : ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా గురువారం మండలంలోని కాట్రావులపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఎన్ఆర్ఐ కల్లెపల్లి రాజేష్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని తరిమి కొట్టడానికి భారత ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా ప్రభుత్వానికి దేశ ప్రజల మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి రాజేష్ కుటుంబ సభ్యులు, జనసేన నాయకులు, కాట్రావులపల్లి ప్రజలు హాజరయ్యారు.

విపత్తులను ఎదుర్కోవడానికి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర -కొవ్వూరు : పటిష్టమైన భద్రత ప్రమాణాలను పాటిస్తూ విపత్తులను ఎదుర్కోవడంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కొవ్వూరు ఆంధ్ర సుగర్స్ ఫ్యాక్టరీ మేనేజర్ ఈ కృష్ణారావు అన్నారు. భారత్ పాక్‌ల మధ్య యుద్ధం అనివార్యం కావడంతో పరిశ్రమల నందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పట్ల అవగాహన కార్యక్రమం, మాక్ డ్రిల్, రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ కర్మాగారంలో ప్రమాదాలు సంభవించినపుడు తగిన భద్రత ప్రమాణాలను పాటిస్తూ ప్రమాదాలను నివారించడంలో సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. ఫ్యాక్టరీ భద్రత అధికారి కెవివి సత్యనారాయణమూర్తి, ఫ్యాక్టరీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సిహెచ్ వి సుక్ మహర్షి, ఫ్యాక్టరీ సిబ్బంది పాల్గొన్నారు.

మాక్ డ్రిల్‌పై అవగాహన: ఆర్డీవో

విశాలాంధ్ర- కొవ్వూరు : ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో యుద్ధ హెచ్చరికల మేరకు ఎటువంటి ప్రమాదాలనైనా ఎదుర్కొన్నేందుకు మాక్ డ్రిల్ ద్వారా పెద్దల్లో అవగాహన కల్పిస్తున్నామని కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత అన్నారు. గురువారం కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం వద్ద పోలీస్ రెవెన్యూ ఫైర్ శాఖల అధికారులు ఆపరేషన్ సింధూర మాక్ డ్రిల్ నిర్వహణపై ప్రజలకి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ యుద్ధ హెచ్చరికల సమయంలో ప్రజలు ప్రమాదాలకు గురి అయినప్పుడు ఎటువంటి జాగ్రత్త చర్యలు తీసుకోవాలో ఆపరేషన్ సిందూర్ మాక్ డ్రిల్ ద్వారా ప్రజలందరూ అవగాహన కల్పించారు. పరిస్థితుల దృష్ట్యా డివిజన్ స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రజలకు అందు బాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. కొవ్వూరు డివిజన్లో ప్రజలకు ప్రమాదాలు జరిగినపుడు వైద్య సేవలు అందించేందుకు 26 హాస్పిటల్స్, 48 వైద్యాధికారులు, 150 మంది నర్సులు, 10 అంబు లెన్సులు సిద్ధంగా ఉంటాయని తెలిపారు. 'ఆపరేషన్ సింధూర మాక్ డ్రిల్' అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందచేస్తున్న సమాచారం, అప్పటి పరిస్థితుల దృష్ట్యా ఎప్పటికప్పుడు సూచనలను చేస్తూ అప్రమత్తం చెయ్యడం జరుగుతుందన్నారు. బాధ్యత కలిగిన పౌరులుగా మీ భాగ స్వామ్యం ఎంతో కీలకం అన్నారు. సైరన్ అల్లరింగ్ మ్రోగించ దం జరుగుతుందన్నారు. వాటిని అనుసరించి సురక్షిత ప్రాంతాల్లో ఉండడం, ప్రజలు వారిని వారు రక్షించు కోవడం, ఇతరులను రక్షించడంలో భాగ స్వామ్యం కావాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి నాగేంద్ర కుమార్, డిప్యూటీ డిఎంహెచ్ఓ జే సంధ్య, సి ఐ, పి విశ్వం, మండల తాసిల్దార్ దుర్గా ప్రసాద్, మున్సిపల్ సిబ్బంది ఆశా వర్కర్లు మరియు తదితరులు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధిలో రాణించాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - సామర్లకోట : సమాజంలో యువత స్వయం ఉపాధిని సాధించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబ)లు పిలుపు నిచ్చారు. కాకినాడ సామర్లకోట పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఎస్ఎస్ గ్రాండ్ ఇన్' రూమ్స్ సముదాయాన్ని ఎమ్మెల్యే చినరాజప్ప, చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు, మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, కాకినాడ జిల్లా బీజేపీ అధ్యక్షులు బిక్కని విశ్వేశ్వరరావు, పెద్దాపురం నియోజకవర్గం బీజేపీ నాయకులు గోరకపూడి చిన్నయ్య దొర ఘనంగా ప్రారంభించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చినరాజప్ప ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రజలకు మంచి సేవలు అందిస్తూ, స్వయం ఉపాధి కల్పన సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడబాల కుమారస్వామి, బదుగు శ్రీకాంత్, జనసేన సరోజ్ వాసు, పిట్ట జానకి రామారావు తదితరులు పాల్గొన్నారు. యువత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తూ సమయాన్ని వృధా చేసుకోకుండా ప్రజలకు మంచి సేవలు అందిస్తూ, స్వయం ఉపాధి కల్పన సాధించాలని కోరారు. యజమాని, యువకుడు అయిన అశోక్ కృషిని ఎమ్మెల్యే, కుడా చైర్మన్ లు అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యార్లగడ్డ చిన్ని, బదుగు శ్రీకాంత్, బలుసు వాసు, జనసేన నాయకులు సరోజ, వాసు, పిట్టా జానకి రామారావు, పెంకే వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - కరప : కరప మండలంలో అభివృద్ధి కార్యక్రమాలను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పాల్గొని ప్రారంభించారు. కరప మండలం వలసపాకల గ్రామంలో ఏర్పాటు చేసిన ఓహెచ్ఆర్ఎస్ వాటర్ ట్యాంకును గురువారం ఆయన ప్రారంభించారు. కరప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఏర్పాటు చేయబోతున్న లేబరేటరీకి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కటకం శెట్టి బాబి, పీజీ సత్యనారాయణ, బందారు మురళి, ఏఎంసి చైర్మన్, ముద్రగడ రమేష్, భోగి రెడ్డి గంగాధర్, యాళ్ళ పండు, భోగి రెడ్డి కొండబాబు, మెండు గోవిందు, ముత్యాలరావు పాల్గొన్నారు.

రక్తదానం ఒకరికి ప్రాణదానం

రక్తదానం ఒకరికి ప్రాణదానమని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. కరప చంద్రన్న సమావేశ మందిరంలో గురువారం రెడ్ క్రాస్ డే పురస్కరించుకుని కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశాల మేరకు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ఎం అనుపమ పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే విచ్చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ప్రమాదంలో జరిగినప్పుడు అత్యవసరంగా రక్తం అవసరం అవుతుందని అటువంటివారిని కాపాడేందుకు రక్త దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. డాక్టర్ ఎన్‌పి రాజారామ్ రక్త సేకరణ చేశారు. కటకం శెట్టి బాబీ, భోగి రెడ్డి గంగాధర్, బందారు మురళి, ఏఎంసీ చైర్మన్ ముద్రగడ రమేష్, భోగి రెడ్డి కొండబాబు, తహసీల్దార్ నందిపాటి సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో సలాది శ్రీనివాసరావు, రాష్ట్ర, జిల్లా మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శులు, యువకులు రక్త దానం చేశారు.

చదువుకు పేదరికం అడ్డు కాదు : రాజీవ్‌కృష్ణ

విశాలాంధ్ర -కొవ్వూరు : చదువుకు పేదరికం అడ్డు కాదని, ఎన్ని ఇబ్బందులు కలిగినా వాటిని అధిగమిస్తూ చదవడమే లక్ష్యంగా చేసుకొని ఇంటర్మీడియట్ ఎంపీసీ విభాగంలో స్టేట్ ర్యాంకర్ గా నిలవడం అభినందనీయమని తెలుగుదేశం పార్టీ నాయకులు ఎస్ రాజీవ్ కృష్ణ అన్నారు. కొవ్వూరు మండలం మద్దూరు గ్రామానికి చెందిన తూము సాయి స్వరూప్ 24 -25 సంవత్సరం ఇంటర్మీడియట్ ఎంపీసీ విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించడం పట్ల గురువారం కొవ్వూరు పట్టణంలోని కార్యాలయం నందు రాజీవ్ కృష్ణ సాయి స్వరూపును అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుండే చదువు పట్ల ఆసక్తి కలిగిన సాయి స్వరూప్ కుటుంబ ఆర్థిక పరిస్థితులను ఎదుర్కొంటూ అంచలంచలుగా విద్యలో అత్యుత్తమ ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో ఉన్నత చదువులను అభ్యసించాలని కోరారు . ఈ కార్యక్రమంలో ఇమ్మని వీర శంకరం,గుళ్ళపల్లి నాగభూషణం, కాట్రగడ్డ వెంకటేశ్వరరావు, కుదప రాజారావు, నున్న బుల్లి వెంకటరత్నం, నాయుడు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు

నర్సరీ రైతుల సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - కడియం : దేశానికి పర్యావరణానికి కడియం నర్సరీ రైతులు చేస్తున్న సేవలు చాలా విలువైనవని తెలంగాణా రాష్ట్రం వరంగల్ జిల్లా నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. కడియం మండలం బుర్రిలంక ఉమా పార్వతి నర్సరీని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి బ్రదర్స్ శివాజీ మూర్తి సృష్టించిన టాల్ బోన్సాయ్ నర్సరీలో 100 సంవత్సరాల వయసు ఉన్న వృక్షజాతి మొక్కలను ఎలా తయారు చేశారో, ఎలా పెంచాలో అడిగి తెలుసుకున్నారు. వృక్షజాతి మొక్కల వల్ల కలిగే ప్రయోజనాలు పెంపకం గురించి మూర్తి వారికి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యక్షంగా పరోక్షంగా కడియం నర్సరీల ద్వారా లక్షలాది మంది ఉపాధి పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యం జగదీష్, అలంపల్లి శ్రీను, స్థానిక నర్సరీ రైతులు పాల్గొన్నారు.

సివిల్ మాక్ డ్రిల్ పై అవగాహన

విశాలాంధ్ర - చాగల్లు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన ఆదేశాల మేరకు గురువారం చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సివిల్ మార్క్ డ్రిల్ నిర్వహించారు. అనుకోని రీతిలో ఉగ్రదాడులు జరిగిన, బాంబులు పేలిన, అగ్ని ప్రమాదాలు సంభవించిన ఎలా వ్యవహరించాలని అంశాలపై ప్రజలకు అప్రమత్తం చేస్తూ అవగాహన కల్పించారు. మండల అధికారులు మాట్లాడుతూ ఏ క్షణాన యుద్ధం వస్తే ప్రజలు ఏ విధంగా ప్రవర్తించాలో తెలియజేస్తూ, యుద్ధం వచ్చే సమయంలో తీసుకోవలసిన సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. . అనంతరం విద్యార్థులతో మార్క్ డ్రిల్ చేయించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దారు మెరికమ్మ, మండల అభివృద్ధి అధికారి శ్రీదేవి, స్థానిక ఎస్సై నరేంద్ర, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది,జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.



ధనుంజయరెడ్డి అరెస్టుపై జర్నలిస్టుల నిరసన

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి అరెస్టును ఖండిస్తూ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ కె పుణ్యవతికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతిరేక వార్తలు రాసినందుకు సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటికి ఏపీ పోలీసులు వెళ్లి భయానక వాతావరణాన్ని సృష్టించి అరెస్టు చేశారన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి మద్దతుగా సీనియర్ న్యాయవాది బలాజ్ రాష్ట్ర కార్యదర్శి బుగతా శివ, మీడియా ప్రతినిధులు సోర్నపూడి సోమేశ్వరరావు, ప్రగడ రామకృష్ణ, ప్రత్తి శ్రీనివాసరావు, దాకారపు కృష్ణ, బర్ల లోవరాజు, తుమ్మల సుబ్బు, కొర్ని ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో సేవలు అందించడమే ఇండియన్ రెడ్ క్రాస్ లక్ష్యం

విశాలాంధ్ర - సీతానగరం: ఆపదలో సేవలు అందించడమే ఇండియన్ రెడ్ క్రాస్ లక్ష్యం అని రెడ్ క్రాస్ సీనియర్ సభ్యుడు సత్యం రమేష్ బాబు అన్నారు. మండలంలోని రఘుదేవపురంలో ఇండియన్ రెడ్ క్రాస్ సీనియర్ సభ్యుడు రమేష్ బాబు గృహంలో అంతర్జాతీయ రెడ్ క్రాస్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దీనిలో తహసీల్దార్ ఏ శ్రీనివాస్, ఎంపిడిఓ ఎమ్ భారతి, ఎస్ ఐ రామ్ కుమార్, మండల వైద్య అధికారి డాక్టర్ చైతన్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యం రమేష్ బాబు మాట్లాడుతూ ఈ రెడ్ క్రాస్ అనే స్వచ్ఛంద సేవ సంస్థ 191 దేశాలలో విస్తరించి, మూడు శాంతి నోబెల్ బహుమతులను పొందిన ఏకైక సంస్థ అని అన్నారు. ఎంపిడిఓ భారతి మాట్లాడుతూ గురువారం అంతర్జాతీయ రెడ్ క్రాస్ దినోత్సవం పురస్కరించుకొని అందరూ భాగస్వాములు కావడం మంచి తరుణం అన్నారు. ప్రతీ ఒక్కరూ రెడ్ క్రాస్ లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తహసిల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ సుమారు 1920 నుండి కులమత ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా రెడ్ క్రాస్ వాలంటర్ల ద్వారా ప్రకృతి విపత్తులు, యుద్ధాలు, కోవిడ్ వంటి కఠిన సమయాలలో రెడ్ క్రాస్ తన వాలంటర్ల ద్వారా ప్రజాసేవ అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో డిటి మూర్తి, కార్యదర్శి వీరేంద్ర, వీఆర్వోలు సచివాలయ, పోలీస్ సిబ్బంది, రెడ్ క్రాస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - గోపాలపురం: దేశంలో నెలకొన్న యుద్ధ వాతావరణ దృష్టిలో ఉంచుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కే అజయ్ బాబు తెలిపారు. గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాల ఆవరణ నందు ఆపరేషన్ సింధూర్ అనే పేరున పోలీస్ వైద్య మండల పరిషత్ అభివృద్ధి ఇతర డిపార్ట్మెంట్ల సిబ్బందితో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కాశ్మీర్లో జరిగిన మిలిటెంట్ల దాడి దృశ్య భారత సైన్యం తీసుకున్న చర్యలను బట్టి ఏ క్షణంలోనైనా పాకిస్తాన్ నుంచి యుద్ధం నెలకొనే పరిస్థితులు ఉన్నాయని అందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రజలను అప్రమత్తం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చైతన్య రాజు ఎంపీడీవో బిబిఎన్ఎస్ శ్రీనివాస్ పలు శాఖల సిబ్బంది పోలీసు యంత్రాంగము పాల్గొన్నారు.

అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

విశాలాంధ్ర - అనపర్తి: ప్రభుత్వ ఆలోచన చేసిన విధంగా రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజ కనీసం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక రైతు సేవా కేంద్రంలో అనపర్తి, బిక్కవోలు మండలాల అగ్రికల్చర్ అధికారులు సిబ్బందితో ఎమ్మెల్యే నల్లమిల్లి సమీక్ష సమావేశం నిర్వహించారు.ధాన్యం కొనుగోలులో రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఎమ్మెల్యే నల్లమిల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ డ్యూటీ ఏమిటంటూ ఎమ్మెల్యే ప్రశ్నించారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన మీరు రైతు సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత మీపై వుందన్నారు. మీకు పరిష్కారం కానీ సమస్యను నా దృష్టికి ఎందుకు తీసుకురాలేదంటూ తీవ్రంగా ప్రశ్నించారు. మూడు రోజుల క్రితం పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మూడు జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించి స్పష్టమైన హామీ ఇచ్చినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఎమ్మెల్యే హెచ్చరించారు. రివ్యూ లో కనిపించిన స్పష్టమైన లోపాలు జాయింట్ కలెక్టర్ తీసుకెళ్లడం జరుగుతుందని నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. కొనుగోలు పూర్తయ్యే వరకు మానిటరింగ్ చేయడం జరుగుతుందని రైతులకు న్యాయం జరిగే వరకూ ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడేది లేదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాష కుటుంబానికి అండగా ఉంటాం: బూరుగుపల్లి

విశాలాంధ్ర - నిడదవోలు: తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో ఫోక్స్ కేసులో నిందితుడిగా ఉన్న శిరంగల అనిల్ దాడిలోహత్యకు గురైన ప్రముఖ వంట మాస్టారు వల్లి బాషా కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే, నిడదవోలు నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి బూరుగుపల్లి శేషారావు, టిడిపి శ్రేణులు పరామర్శించి భాష కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. భాష కుటుంబాన్ని అన్ని విధాలుగా అండగా ఉంటామని శేషారావు తెలిపారు. నిడదవోలు పట్టణ 23వ వార్డు లింగంపల్లిలో ఇటీవల మృతి చెందిన కొమ్మిన ధనరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి బూరుగుపల్లి శేషారావు ప్రగాఢ సానుభూతి తెలిపారు ఆయన వెంట పట్టణ టిడిపి అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ షాజహాన్ పాల్గొన్నారు.

వలి కుటుంబానికి ఆర్థిక సాయం

పేద కుటుంబానికి చెందిన వంట మాస్టర్ వలి హత్యకు గురయ్యారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, హత్యకు గురైన వంట మాస్టర్ వలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి బిజెపి, మైనార్టీ సోదరులు తరపున రంగా వెంకటేశ్వరరావు రూ.20 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట పట్టణ బీజేపీ అధ్యక్షులు మొర్త ప్రమోద్ కుమార్, స్టేట్ బీజేపీ మైనార్టీ సెక్రటరీ షేక్ ఖమురుద్దీన్ , తూర్పుగోదావరి జిల్లా మైనార్టీ అధ్యక్షులు జెడ్.ఏ బేగ్, బీజేపీ కార్యకర్తలు మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

అరుణోదయ సభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర - జగ్గంపేట: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 50 వసంతాల ముగింపు సభలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. మండలంలోని రామవరం రంగవల్లి నగర్ వద్ద గురువారం ఆ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కర్నాకుల మాట్లాడుతూ భూమి, భుక్తి ఈ దేశ విముక్తి కోసం సాగిన పోరాటాల్లో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తన కళలతో ప్రజలను చైతన్య పరిచి కీలక భూమిక పోషించిందన్నారు. ఈనెల 12న హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ముగింపు సభ జరుపుకుంటుందన్నారు. ఈ సభను విప్లవ సానుభూతిపరులు, విద్యార్థి మేధావులు, కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి రమేష్, ఎఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు కుంచె అంజిబాబు, పిడిఎస్యూ విజృంభణ రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, దాన్ శీను తదితరులు పాల్గొన్నారు.

మాక్ డ్రిల్ ప్రదర్శన

విశాలాంధ్ర-దేవరపల్లి: ఆపరేషన్ సింధూర్ సందర్భంగా దేవరపల్లి బస్టాండ్ వద్ద సివిల్ డిఫెన్స్పై అవగాహన మాక్ డ్రిల్ ప్రదర్శన దేవరపల్లి ఎస్సై ఎంపీడీవో తహసీల్దార్ ఆధ్వర్యంలో గోపాల పురం వైభవ్ న్యూ గోదావరి న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి ఆపరేషన్ సింధూర్ పురస్కరించుకుని దేవరపల్లి బస్టాండ్ వద్ద గురువారం దేవరపల్లి ఎస్ఐ వి సుబ్రహ్మణ్యం ఎంపీడీవో ఎస్ వేణుగోపాల్రెడ్డి ఇన్చార్జి తహసీల్దార్ ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సివిల్ డిఫెన్స్పై అవగాహన మాక్ డ్రిల్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ శత్రుదేశం మన దేశంపై దాడి చేస్తే ఏ విధంగా ఆత్మ రక్షణ చర్యలు తీసుకోవాలి ముందు జాగ్రత్త చర్యలు ఎలా తీసుకోవాలి విధానంపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా అనుకోని పరిస్థితుల్లో బాంబులు దాడి చేస్తే ప్రజలు చెవులు మూసుకుని నేల మీద బారసాపుగా పడుకోవాలని సూచించారు. ఎంపీడీవో ఎస్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ శత్రుదేశం కాశ్మీర్లో అమాయక ప్రజలపై టూరిస్టులపై ఉగ్రవాదులు దాడులు చేసి మన పౌరులను టూరిస్టులను దారుణంగా తీవ్రవాదులు చంపి వేశారని అన్నారు. దీని ప్రతి కార్య చర్యగా భారతదేశం పాకిస్తాన్ లో ఉగ్రవాదుల స్థావరాలపై దాడి చేసి ధ్వంసం చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు బి రామచంద్రరావు నిట్ట రవి కిషోర్ అమ్మిరాజు వీఆర్వోలు సచివాలయ సిబ్బంది ఆరోగ్యశాఖ సిబ్బంది పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ప్రజలకు అవగాహన

విశాలాంధ్ర- తాళ్లపూడి: మన భారత దేశాన్ని ఎదుర్కొనే సత్తా లేని పాకిస్థాన్ నేరుగా మన సైన్యంతో కాకుండా దొంగ దారుల్లో మన దేశంపై దాడులు చేసి అవకాశం ఉన్నందున, తప్పని పరిస్థితుల్లో ఎవరికి వారు రక్షణ కల్పించుకునే విధానాలు గురించి తెలియ చేస్తూ మండల కేంద్రమైన తాళ్లపూడి బస్టాండ్ కూడలిలో పోలీస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖ సహ పలువురు అధికారులు ప్రజల రక్షణ కొరకు సూచనలు చేశారు. భారత్ దేశంలో యుద్ధ ప్రభావిత ప్రాంతాలుగా 294 జిల్లాను గుర్తించి రెడ్ జోన్ గా అధికారులు గుర్తించారని, యుద్ధ వాతావరణం ఎదురైతే, కంటిన్యూ సైరన్ మ్రోగుతుందని, అటువంటి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాళ్లపూడి ఇంచార్జి తహశీల్దార్ మోహన భారతి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమంలో ఎస్సై టి.రామకృష్ణ, ఎంపీడీఓ రమణ, మండల ఏ.ఎస్.ఓ జోడాల్ వెంకట్, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన తరగతులు

విశాలాంధ్ర - కాకినాడ: వేసవి విజ్ఞాన తరగతులు కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని, విద్యార్థులకు AM+ స్కూల్ డ్రాయింగ్ ఉపాధ్యాయులు వీ చిన్నబాబు చిత్రలేఖనం, పెన్సిల్ ఆర్ట్ శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు సులువుగా నెంబర్ల ద్వారా డ్రాయింగ్ గీయడం నేర్పించారు. ఈ తరగతిలో విద్యార్థులు ఎంతో ఆసక్తిగా నేర్చుకున్నారు. డీఆర్డీపీ సిబ్బంది వీ సత్య బాల విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్పై శిక్షణ ఇచ్చారు. విశ్రాంత ఉపాధ్యాయులు దీ సూర్యనారాయణ మాస్టారు విద్యార్థులకు నీతి కథలు బోధించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయ ఇన్ఛార్జి అధికారికిషోర్, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది రాజు, నాగేంద్ర కుమార్, వీర్రాజు, అరుణ, ప్రియదర్శిని, స్థానిక పాఠశాలల విద్యార్థుల పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత ఆన్లైన్ శిక్షణ ప్రారంభం

విశాలాంధ్ర - కాకినాడ: కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన డిఎస్సి ఉచిత ఆన్లైన్ శిక్షణ తరగతులు గురువారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ఆర్థిక భారం కారణంగా శిక్షణ తీసుకోలేని నిరుద్యోగ యువతను ప్రోత్సహించే లక్ష్యంతో కాకినాడకు చెందిన ప్రఖ్యాత శ్యామ్ ఇనిస్టిట్యూట్తో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు నాలుగు రోజుల క్రితం ఆన్లైన్ ద్వారా అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించగా విశేష స్పందన లభించింది. కాకినాడ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుండి ఇప్పటివరకు సుమారు 1000 మంది అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం నమోదు చేసుకోగా, గురువారం ఎంపీ ఉదయ శ్రీనివాస్ వర్చువల్గా ఆన్లైన్ ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్యామ్ ఇన్స్టిట్యూట్ అధినేత శ్యామ్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఉచిత శిక్షణ కోసం నమోదు చేసుకునేందుకు రేపటి వరకు గడువు పొడిగించామని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంపీ సానా సతీష్ బాబు దంపతులు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - కాకినాడ: వైశాఖ మాసంలో జరిగే కళ్యాణంలో భాగంగా కాకినాడ రామారావు పేటలో వేంచేసి ఉన్న శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దివ్య కళ్యాణం జరిగింది. ఈ కళ్యాణంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు సతీసమేతంగా పూజాధికార కార్యక్రమంలో పాల్గొని స్వామి దివ్య కళ్యాణం అత్యంత వైభవంగా జరిపించారు. ఈ శివ కళ్యాణంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) పాల్గొన్నారు. సానా సతీష్ బాబు తన చిన్నతనం నుండి రామారావు పేట గాంధీనగర్ కాకినాడ నగర ప్రాంత ప్రజలకు సుపరిచితుడు. ఈ కళ్యాణం ఏర్పాట్లు టేకు వెంకటరమణ దగ్గరుండి పర్యవేక్షించి కళ్యాణంలో పాల్గొన్న దంపతులకు కళ్యాణ మహోత్సవం తిలకించడానికి వచ్చిన భక్తులందరికీ ఏ అసౌకర్యం కలగకుండా చూడడమే కాకుండా తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఈ కళ్యాణంలో ఆలయ ఈవో సాయి బాబు, కూటమి నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, సులుకుర్తి వెంకటేశ్వరరావు, కాకినాడ నగర టిడిపి అధ్యక్షులు మల్లిపూడి వీరు, మాజీ మేయర్ అరిగెల శ్రీనివాస్ (బుజ్జి), అల్ల బాలకృష్ణ పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లిలోని వెలసిన అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం మహోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల కళ్యాణం మహోత్సవంలో భాగంగా స్వామికి ఉదయం సాయంత్రం పూజ కార్య క్రమం నిర్వహించారు. ప్రతి సంవత్సరం స్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహించడం జరుగు తుందని ఆలయ కమిటీ చైర్మన్ పసగాడ రామ కృష్ణ తెలిపారు. ఈ కళ్యాణ మహోత్సవాన్ని నందిపాటి రాంబాబు, అమ్మాజీ దంపతులు పీటలపై కూర్చుని జరిపించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రాణ రక్షణపై అవగాహన

విశాలాంధ్ర - నిడదవోలు: పాక్ ఆక్రమిత కాశ్మీర్లో భారత్ 9 ఉగ్రవాద సంస్థలపై ఆపరేషన్ సింధూర్ పేరిట దాడి చేసింది. దాడికి ప్రతిదాడిగా పాకిస్తాన్ కనుక భారత్‌పై దాడి చేస్తే ఆ దాడి నుండి ప్రాణాల రక్షణకు పౌరులు తీసుకోవలసిన జాగ్రత్తలపై స్థానిక ఐ లవ్ నిడదవోలు సెంటర్లో సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ నిర్వ హించారు. అగ్నిమాపక అధికారులు, పోలీస్ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల, పట్టణ స్థాయి అధికారులు పాల్గొని యుద్ధ సమయంలో తీసు కోవలసిన జాగ్రత్తలను పుర ప్రజలకు వివరిం చారు. మున్సిపల్ కమిషనర్ పి కృష్ణవేణి, ఎంపీ డిఓ లక్ష్మీనారాయణ, ఆర్ ఐ సత్యేంద్ర, పట్టణ ఎస్సై జగన్ మోహన్ రావు, ఫైర్ ఎస్సై శ్రీనివాసరావు అధికార సిబ్బంది పాల్గొన్నారు.

దాడులపై మాక్ డ్రిల్

విశాలాంధ్ర - అనపర్తి : పాక్-భారత్ మధ్య తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో దాడులు జరిగిన సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అధికారులు వివరించారు. గురువారం ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ అనిల్ కుమార్, ఫైర్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస రెడ్డి, పంచాయతీ, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ సంయుక్తంగా మాక్ డ్రిల్ నిర్వహించారు.

జయహో సైనికా...

: విశాలాంధ్ర - అమలాపురం : జయహో సైనికా.. పెహల్గాం 'అమరులు ' ఆత్మ శాంతించింది. భారత్ సైన్యం 'ఆపరేషన్ సిందూర'ను వీరోచితంగా నిర్వ హించి ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడాన్ని కోనసీమ జేఏసీ కార్యవర్గం స్వాగతించింది. కన్వీనర్ బండారు రామమో హన్‌రావు ఆధ్వర్యంలో అమలాపురం పట్టణంలో స్థానిక గడియారస్థంబం సెంటర్ వద్ద వేడుక మందిరంలో గురు వారం ఉదయం జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడు తూ పెహల్గాం మృతవీరులు కుటుంబాలు ఎంతో క్షోభను అనుభవించారని, ఆ దాడులకు కేంద్రమైన ఉగ్రవాద శిబిరా లను మన సైన్యం నేటి తెల్లవారుజామున నేలమట్టం చేయడం అభినందనీయమని అన్నారు. ఈ దాడులు ఇంతటితో ఆపకూడదని పీఓకె ను స్వాధీనం చేసుకునేవారు కొనసాగించాలని పేర్కొన్నారు. కన్వీనర్ బండారు రామమోహన్‌రావు మాట్లాడుతూ మానవత్వానికి, ఉగ్రవాదానికి మధ్య జరుగుచున్న ఈ పోరులో, ప్రపం చంలోని అన్ని దేశాలు విజ్ఞతతో భారత్ పక్షాన్న నిలవాలని కోరారు. అనంతరం గడియారస్థంబం కూడలికి ర్యాలీగా వెళ్ళి పటాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. దా రాయుడు, రామచంద్రమూర్తి, దంగుడుబియ్యం శ్రీనివాస రావు, వడలి రాధాకృష్ణ, సంధ్యాల నాయుడు పాల్గొన్నారు.

ప్రజల రక్షణకు మాక్ డ్రిల్స్

విశాలాంధ్ర - అమలాపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు తమను తాము ఎలా రక్షించుకోవాలో అవగాహన కల్పించే ఉద్దేశంతో గురువారం అమలాపురం కిమ్స్ హాస్పిటల్ ప్రాంగణంలో మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. భారత్, పాకిస్తాన్ మధ్య అసాధారణ పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో అత్యవసర పరిస్థితులను తట్టుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. కార్యక్రమాన్ని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా ఫైర్ అధికారి పర్యవేక్షణలో, అమలాపురం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ మురళి కొండబాబు నేతృత్వంలో జిల్లా అగ్నిమాపక శాఖ విజయవంతంగా నిర్వహించింది. మాక్ డ్రిల్‌లో హాస్పిటల్ సిబ్బంది, రోగులు మరియు ప్రజలు భాగస్వామ్యమై భవనం నుండి సురక్షితంగా బయటపడే పద్ధతులు, అగ్నిప్రమాద సమయంలో అనుసరించవలసిన జాగ్రత్తలు, అత్యవసర విరామ మార్గాల వినియోగం వంటి అంశాలపై ప్రాక్టికల్ డెమో ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమలాపురం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ మురళి కొండబాబు, అమలాపురం, ముమ్మిడివరం అగ్నిమాపక సిబ్బంది, కిమ్స్ ఆసుపత్రి సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల నిరసన

విశాలాంధ్ర - పెద్దాపురం : సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి కార్యాలయంపై కూటమి నేతల దాడికి నిరశిస్తూ గురువారం సాయంత్రం పెద్దాపురం నియోజకవర్గ పాత్రికేయులు శాంతియుత నిరసన చేపట్టారు. నియోజకవర్గ సీనియర్ జర్నలిస్టులు అడపా వెంకట్రావు, ఐజేయు సభ్యులు రాకుర్తి రాంబాబు, ఏపీయూడబ్ల్యూజే, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద నినాదాలు తెలియజేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీఓ కె శ్రీరమణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు అరికట్టాలన్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సాక్షి పత్రికలో తమపై వ్యతిరేకంగా వార్త ప్రచురితమైందని కక్షతో కూటమి ప్రభుత్వ హయాంలో పత్రికలపై దాడులు చేయడం, పర్నీచర్ ధ్వంసం చేయడం దారుణమన్నారు. కథనంలో వాస్తవాలు లేకుండా వివరణ ఇవ్వాలే గాని ఇటువంటి దాడులు సరికాదన్నారు. ఇప్పటికైనా పత్రికా ప్రతినిధులు, కార్యాలయాలపై దాడులు ఆపాలని, పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాలని కోరారు. నిరసన కార్యక్రమానికి సిఐటియు నాయకులు నిలపాల సూరిబాబు, డి క్రాంతికుమార్, చల్లా విశ్వనాథంలు మద్దతు తెలిపారు. పత్రికా కార్యాలయాలపై దాడులు అమానుషమని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పాత్రికేయులు పెమ్మాడ వీరభద్రమ్మ, బిక్కిన వెంకటార్, చవ్వాకుల ఈశ్వరరావు, ఉప్పలపాటి చంద్రదాస్, జి సుబ్రహ్మణ్యం, పీఎస్ గంగాధర్, అడ్డగర్ల సురేంద్రనాద్, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ దురంధరుడు మూలారెడ్డి

విశాలాంధ్ర - అనపర్తి : రాజకీయ దురంధరుడు, టిడిపి వ్యవస్థాపక సభ్యులు,స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి 83వ జయంతి ఘనంగా నిర్వహించారు. గురు వారం రామవరం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్వగృహంలో తన తండ్రి మూలారెడ్డి చిత్రం పటానికి, మెయిన్ రోడ్డులో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఎమ్మెల్యే,కుటుంబ సభ్యులు ఘన నివాళులు అర్పించారు.అదే విధంగా నియోజకవర్గ కేంద్రం అనపర్తి తో పాటు అన్ని గ్రామాల్లో కూటమి నేతలు, కార్యకర్తలు,అభిమానులు మూలా రెడ్డి విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి కేక్ కట్ చేసారు. అనపర్తి ఏరియా ఆసుపత్రిలో రోగులకు ఎమ్మెల్యే నల్లమిల్లి పండ్లు,రొట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్,యువనేత నల్లమిల్లి మనోజ్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు (శ్రీను), ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామ గుర్రెడ్డి,సిరసపల్లి నాగేశ్వరరావు, కర్రి శేషారత్నం, ఓగిరెడ్డి రాధ, షేక్ దరియా,తేనెల శ్రీను, ఎన్ డి ఏ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

యువకుడి మృతి

విశాలాంధ్ర - మామిడికుదురు : పాశర్లపూడి- బోడసకుర్రు వైనతేయ వారధిపై నుంచి గోదావరిలోకి దూకి యువకుడు మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే అమలాపురం మండలం కామనగరువు గ్రామానికి చెందిన అన్నదమ్ములు అయిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వస్తూ బ్రిడ్జి పై ఆగారు. వీరిలో కామన భార్గవ్ (21) అనే యువకుడు అకస్మాత్తుగా గోదావరిలోకి దూకేశాడు. తమ్ముడు భార్గవ్‌ను రక్షించేందుకు అన్న రాజేష్ గోదావరిలోకి దూకి రక్షించే ప్రయత్నాలు చేసిన ఫలించకపోవడంతో రాజేష్ ప్రమాదంలో చిక్కుకునే పరిస్థితి ఏర్పడింది. అటు వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ భారీ పగ్గం గోదావరిలోకి విసరగా స్థానికులు సహా యంతో పగ్గం పట్టుకుని వేలాడుతున్న రాజేష్‌ను గోదావరిలో మత్స్యకారులు రక్షించి ఒడ్డుకి చేర్చారు. యువకుడు కోసం గాలింపు చర్యలు చేపట్టగా భార్గవ్ మృతదేహం లభ్యమైంది. నగరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

VASTU HOUSING FINANCE

వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

యూనిట్ 203 & 204, 2వ అంతస్తు, "ఎ" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సెర్వి (వెస్ట్), ముంబయి-400015, మహారాష్ట్ర.

CIN No.: U65922MH2005PLC272501

స్వాధీనతా ప్రకటన

ఏదైతే, క్రింది సంతకందారు వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9తో చదువబడే, సెక్షన్ 13(12) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, **డిమాండ్ నోటీసు** జారీచేసి, ఇందు దిగువ పేర్కొనబడిన రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా సదరు నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది. రుణగ్రహీతలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, దిగువ సంతకందారు సదరు రూల్స్ యొక్క రూల్ 9తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఇందు దిగువ పేర్కొన్న తేదీన క్రింద వివరించిన ఆస్తిని **స్వాధీనంచేసుకున్నారు.** ప్రత్యేకించి రుణగ్రహీత& హామీదారు మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు దిగువ పేర్కొన్నట్లు మొత్తాలను మరియు దానిపై వడ్డీ, ఖర్చులు మొ॥వాటిని చెల్లించుటకులోబడి ఉంటుంది.

క్ర. సం.	రుణగ్రహీత, సహ-రుణగ్రహీత పేరు మరియు ఎల్ఎఎన్ నం.	డిమాండ్ నోటీసు తేది& మొత్తాలు	ఆస్తి వివరణ	స్వాధీనతా తేది& విధానం
1	కృష్ణ కోమటి, పద్మావతి కోమటి, LP0000000027956	**12 మే, 2021,** మరియు 30 ఏప్రిల్ 2021 నాటికి రూ. **19,43,388/-**	తూర్పు గోదావరి జిల్లా, ఆత్రేయపురం మండలం, రావులపాలెం సబ్-రిజిస్ట్రీ, మెర్లపాలెం పంచాయతి ఏరియా, మెర్లపాలెం గ్రామం, జడ్-మెరక ఆర్.ఎస్.నం.82/2, డోర్ నం.2-72 దగ్గరలో, ఎక.6.72సెంట్లు కలిగియున్న ల్యాండెడ్ ఆస్తి పూర్తి విస్తీర్ణంతో ఎక.1.00సెంట్లు కలిగియున్న సెంట్రల్ లో ల్యాండెడ్ ఆస్తి, ఎక.0.20సెంట్లు లేదా 968చ.గ.లు కలిగియున్న ఉత్తరం వైపు ల్యాండెడ్ ఆస్తిలో, 120.63చ.గ.లు కలిగియున్న సైటు. ఉత్తరం: పంచాయతి రోడ్, దక్షిణం: మట్టా త్రిమూర్తులు ఆస్తి, తూర్పు: మట్టా తమ్మయ్య & గారపాటి సత్యనారాయణ ఆస్తి, పడమర: యెరసాని అమ్మాజి & మట్టా తమ్మయ్య ఆస్తి.	భౌతిక స్వాధీనం చేసుకున్న తేది: 05 మే, 2025

తేది: 09.05.2025
ప్రదేశం: తూర్పు గోదావరి

అధీకృత అధికారి,
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్.

దేశానికి వెన్నుముఖ రైతు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కరప : దేశానికి వెన్నుముఖ రైతేనని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. గురువారం కరప నక్కా సూర్యనారాయణ మూర్తి, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వ్యవసాయ శాఖ అధికారులు ఏడీఏ బాబురావు, ఏవో రాజేష్ ఏర్పాటు చేసిన వ్యవ సాయ యాంత్రీకరణ పనిముట్లు రైతులకు అందజేయు కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకుం టుందని ఆయన పేర్కొన్నారు. రూ.37 లక్షల రాయితీతో ఏర్పాటు చేసిన 37 పవర్ టిల్లర్ ట్రాక్టర్లను రైతులకు ఎమ్మెల్యే చేతుల మీద అందించారు. కటకం శెట్టి బాబి, బందారు మురళి, భోగి రెడ్డి కొండబాబు పాల్గొన్నారు.

ప్రకటన



డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం, అల్లవరం గ్రామ కాపరస్తులు
ఆకుమర్తి నాగేశ్వరరావు, తండ్రి: వెంకటరెడ్డి (లేటు) గారు వ్రాయించి ఇచ్చిన ప్రకటన.
మా అమ్మగారు ఆకుమర్తి సత్యవతి
అల్లవరం గ్రామంలో మా ఇంటి వద్ద 02-12-2021 సంవత్సరంలో మరణించినారు.
వీరి మరణం గ్రామ పంచాయితీ రికార్డులో నమోదు కాలేదు.
ఏమైనా అభ్యంతరాలు ఉన్న యెడల 10 రోజుల్లో తెలియజేయగలరు.

ఆకుమర్తి నాగేశ్వరరావు, తండ్రి: వెంకటరెడ్డి
9-48/1, అల్లవరం, అల్లవరం మండలం, సెల్: 6281964451

ఆపరేషన్ సిందూర్‌పై ప్రశంసలు

విశాలాంధ్ర - కడియం : పాకిస్థాన్‌లో ఉగ్రవాద స్థావరాలపై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కి కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి రూరల్ ఇంచార్జ్ తాడాల కొండ్రాజు ప్రశంసలు కురిపించారు. ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన సైనికులకు సెల్యూట్ చేస్తున్నానని తాడాల తెలిపారు.దేశం కోసం అందరూ అండగా నిలబడి రక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కొత్త రేషన్ కార్డులకు నమోదు చేసుకోండి : మంత్రి

విశాలాంధ్ర - ఏలూరు: నూతన రైస్ కార్డులు జారీతోపాటు మార్పులు, చేర్పులకు సంబంధించి మొత్తం ఆరు రకాల సేవలకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన రైస్ కార్డులు జారీ, కార్డుల విభజన, చిరునామా మార్పు, సభ్యులను చేర్చడం, ఉన్నవారిని తొలగించడం, కార్డులను సరెండర్ చేయడం మొత్తం ఆరు రకాల సేవలను అందుబాటులోకి తేవడం జరిగిం దన్నారు. సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో నమోదు చేసుకునేందుకు అవకాశం వుందన్నారు. రైస్ కార్డులో తప్పుడు ఆధార్ నెంబర్ సీడింగ్‌ను సరిచేసుకునేందుకు అవకాశం కల్పించబడిందన్నారు. జూన్ మాసంలో స్మార్ట్ కార్డు రూపంలో నూతన రైస్ కార్డుల జారీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నదన్నారు. 2024 ఎన్నికల నేపధ్యంలో నూతన కార్డుల జారీని నిలిపివేయవల్సిందిగా భారత ఎన్నికల సంఘం గతఏడాది మార్చిలో ఆదేశాలు జారీ చేసిందని, తదుపరి ఈకెవైసి తప్పనిసరిగా నమోదు చేయాలని సుప్రీం కోర్టు జారీచేసిన ఆదేశాల మేరకు నూతన కార్డుల జారీకి అవకాశం లేకుండా పోయిందన్నారు. అయితే ఇప్పటివరకు 94.4 శాతం మేర ఈకెవైసి ప్రక్రియ పూర్తయిన నేపధ్యంలో నూతన రైస్ కార్డుల జారీకి అవకాశం కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో మొత్తం 1,46,21,223 రైస్ కార్డులు ఉన్నాయని ఈ కార్డుల ద్వారా దాదాపు 4,24,59,028 మంది తమ పేర్లను నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు మరియు 80 సంవత్సరాలు పైబడిన వారికి ఈకెవైసి చేయాల్సిన అవసరం లేదనే వెలుసుబాటు కల్పించడంతో సుమారు 6,45,765 మందికి ఈకెవైసి చేయడం జరగలేదన్నారు. అదే విధంగా ఇప్పటికే 3.94 లక్షల మంది తమ రైస్ కార్డులో మార్పులు, చేర్పులకోసం నమోదుచేసుకోవడం జరిగిందన్నారు. ఈఏడాది జూన్ మాసంలో క్యూఆర్ కోడ్ తో స్మార్ట్ రైస్ కార్డులను జారీచేయడం జరుగుతుందన్నారు. ఆ కార్డులపై కుటుంబ సభ్యుల వివరాలు అన్ని ఉంటాయని ఆ కార్డును స్కాన్ చేయగానే అన్ని వివరాలు కనిపిస్తాయని డేటా బేస్ కు ఈ కార్డును లింక్ చేయడంవల్ల సిస్టంలో ఆటోమేటిక్ గా డేటా కూడా అప్ డేట్ అవ్వడం జరుగుతుందన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే 6 నెలల రేషన్ వివరాలు తెలుస్తాయన్నారు. స్మార్ట్ కార్డుతో దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకునే వెసులుబాటు ఉందన్నారు. ఏలూరు జిల్లాలో మొత్తం 6,20,146 రైస్ కార్డులు ఉన్నాయని ఈ కార్డుల ద్వారా దాదాపు 17,31,461 మంది తమ పేర్లను నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 16,15,078 మంది ఈకెవైసి పూర్తయిందన్నారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు మరియు 80 సంవత్సరాలు పైబడిన వారికి ఈకెవైసి చేయాల్సిన అవసరం లేకపోవడంతో సుమారు 25,030 మందికి ఈకెవైసి చేయడం జరగలేదన్నారు

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కార్పొరేట్లకు అప్పగించడానికి ప్రయత్నిస్తుందని బండి వెంకటేశ్వరరావు,డి ఎన్ వి డి ప్రసాద్,ఎస్ రామ్మోహన్ రావు ప్రభుత్వ చర్యను వారు ఖండించారు. 20న సమ్మెకు ఇప్పటినుంచే కార్మిక సంఘాలు కార్మికులకు తెలియజేస్తూ సమ్మె ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తూ సమ్మె జయప్రదానికి కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ముందుగా కాశ్మీరులో ఉగ్రదాడిలో మరణించిన దేశ పౌరులకు సంతాపం తెలిపింది. సదస్సుకు ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి ఏ. అప్పలరాజు స్వాగతం పలకగా సిఐటియు నాయకులు జె. గోపీ వందన సమర్పణ చేశారు. సదస్సులో సిఐటియు నాయకురాలు కె విజయలక్ష్మి పాల్గొన్నారు.

విశాలాంధ్ర ఏలూరు: ఈ నెల 20న దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. గురువారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనము నందు కార్మిక సంఘాల జిల్లా సదస్సు ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ లింగరాజు,ఐ ఎఫ్ టి యు, ఉమ్మడి జిల్లా కార్యదర్శి బద్దా వెంకటరావు అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి డి.ఎన్.వి.డి. ప్రసాద్,ఐ.ఎఫ్.టి.యు. జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. రామ్మోహన్‌రావులు మాట్లాడుతూ కేంద్ర మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్లుగా మార్చడం ద్వారా కార్మిక హక్కులను హరించి వేస్తుందని కార్మిక సంఘ నాయకులు కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా వ్యతిరేకించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలను తక్షణమే విడనాడాలి డిమాండ్ చేశారు. ఈనెల 20న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను కేంద్ర ప్రభుత్వా నికి తెలియజేయాలని నాయకులు కోరారు. 20వ తేదీన సమ్మె సందర్భంగా పట్టణ,మండల కేంద్రాలతో పాటు జిల్లా కేంద్రంలో వందలాదిమంది ఉద్యోగ కార్మికులతో ప్రదర్శన,సభలు నిర్వహించాలని నాయకులు కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం మార్పు పేరుతో కాలరాస్తుందని వారు విమర్శించారు. సమ్మె చేసే హక్కును సంఘం పెట్టుకునే హక్కును అలా చాలా చట్టాలను కార్మిక వర్గానికి దూరం చేస్తూ, కార్పొరేట్లకు,ప్రైవేట్ యాజమాన్యాలకు లబ్ధి చేకూర్చే విధానాలను చేపట్టిందని వారు విమర్శించారు. 78 సంవత్సరాల స్వాతంత్ర భారత్ లో ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను,పరిశ్రమలను కార్పొరేట్లకు ప్రైవేటు వ్యక్తులకు కారుచౌకగా మోదీ ప్రభుత్వం అప్పగిస్తుందని విమర్శించారు. అందులో భాగంగానే

మాక్ డ్రిల్‌పై ప్రజలకు అవగాహన

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ఆపరేషన్ సింధూర మాక్ డ్రిల్ నిర్వహణపై జిల్లా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు పేర్కొన్నారు. స్థానిక కోటిపల్లి బస్టాండ్ సమీపంలో రోడ్ కం రైల్వే వంతెన వద్ద 'ఆపరేషన్ సింధూర మాక్ డ్రిల్' అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు మాట్లాడుతూ, ఇటీవల భారత భూ భాగంలో పెహల్గాం ప్రాంతంలో పాకిస్తాన్ కు చెందిన ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన "ఆపరేషన్ సింధూర' నేపథ్యంలో యుద్ధ పరిస్థితులు సమయంలో ప్రజలు ఎలా స్పందించాలీ, ఎటువంటి ఇబ్బందులూ లేకుండా, ప్రాణ నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం పై అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశ్యం ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రయత్నం చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం పరిస్థితుల దృష్ట్యా ఎప్పటికప్పుడు సూచనలను చేస్తూ అప్రమత్తం చెయ్యడం జరుగుతుందని, బాధ్యత కలిగిన పౌరులుగా మీ భాగస్వామ్యం ఎంతో కీలకం అన్నారు. సైరన్ మ్రోగించడం జరుగుతుందన్నారు. వాటిని అనుసరించి సురక్షిత ప్రాంతాల్లో ఉండడం, ప్రజలు వారిని వారు రక్షించు కోవడం, ఇతరులను రక్షించడంలో భాగస్వామ్యం కావాలని పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా రెవిన్యూ డివిజన్ అధికారి ఆర్ కృష్ణ నాయక్, డీఎస్పీ భవ్య కిషోర్, ఆర్ఎంసి అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర రావు, జిల్లా అగ్నిమాపక అధికారి మార్టిన్ లూథర్ కింగ్, తదితరులు యుద్ధ హెచ్చరికల నేపథ్యంలో తీసుకోవలసిన చర్యలను, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను, స్వీయ రక్షణ కోసం చర్యలపై ప్రజలలో చైతన్యం కలిగించే ప్రసంగాలు చెయ్యడం జరిగింది.

ధనుంజయరెడ్డి అరెస్టు అప్రజాస్వామికం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డిని పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఏలేశ్వరం ప్రెస్ క్లబ్ సభ్యులు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి అరెస్టును ఖండిస్తూ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ కుశరాజుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సొర్నంపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటికి ఏపీ పోలీసులు వెళ్లి భయానక వాతావరణాన్ని సృష్టించి అరెస్టు చేయడం దారుణమని అన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు కోరాడ శ్రీనివాసరావు, శిడగం మాధవ్, దొంతంశెట్టి సతీష్, అడపా దుర్గారావు, చిలికోటి సుధీర్, తొగర సూరిబాబు, పారేపల్లి గంగా ప్రసాద్, షేక్ ఇమ్రాన్, గ్రంధి స్వామి తదితరులు పాల్గొన్నారు.

జీ తెలుగులో రాబిన్ హుడ్, సరికొత్త ధారావాహిక ఘరానా మొగుడు ప్రారంభం

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం: ప్రేక్షకులను ఆకట్టుకున్న సూపర్ హిట్ సినిమా 'రాబిన్హుడ్'ను వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా అందిస్తోందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నపిల్లల్లోని నటనా ప్రతిభను వెలికితీస్తూ అశేష ప్రేక్షకాదరణతో కొనసాగుతున్న డ్రామా జూనియర్స్ 8 ఈ వారంమాత్మదినోత్సవం ప్రత్యేక ఎపిసోడ్తో అలరించేందుకు సిద్ధమైందన్నారు. ప్రారంభం నుంచీ జీతెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న జీ తెలుగు సూపర్ సీరియల్ ఛాంపి యన్షిప్ ఈవారం ఫినాలేకి చేరుకుందన్నారు. అంతేకాదు కుటుంబ కథతో పవన్ సాయి, అక్షిత, భావన ప్రధానపాత్రల్లో తెరకెక్కుతు న్నసరికొత్త సీరియల్ ఘరానా మొగుడు ప్రారంభంకా నుందన్నారు. యాక్షన్ఎంటర్టైనర్ రాబిన్హుడ్ ఈ శనివారం సాయంత్రం 6 గంటలకు, డ్రామా జూనియర్స్ 8 మాతృ దినోత్సవ ప్రత్యేక ఎపిసోడ్ రాత్రి 9 గంటలకు,సూపర్ సీరియల్ ఛాంపియన్షిప్ గ్రాండ్ ఫినాలే ఆదివారం రాత్రి 9గంటలకు, సరికొత్త ధారావాహిక ఘరానా మొగుడు మే 12న ప్రారంభం, సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటలకు, మీ జీ తెలుగులో ప్రాసారమవుతుందని తెలిపారు. నితిన్, దేవదత్త నాగే, శ్రీలీల, వెంకీ కుడుముల దర్శకత్వంలో,నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించిన ఈసినిమాలో నితిన్, శ్రీలీల, దేవదత్త నాగే,సిజ్జు, డేవిడ్ వార్నర్ ముఖ్యపాత్రలు పోషించారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించినఈ యాక్షన్ ఎంటర్టైనర్ని మీరూ తప్పకుండా చూసేయండి. ప్రతిభావంతులైననటీనటులు, ఆకట్టుకునే కథతో ఘరానా మొగుడు సీరియల్ జీ తెలుగువీక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. పవన్ సాయి, అక్షిత ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా,భావన, తేజల్, శరత్ చంద్ర, సుచిత్ర కీలక పాత్రల్లోకని పించనున్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండలంలోని పెద్దిపాలెం గ్రామంలో సుమారు రూ.37.80 లక్షల వ్యయంతో నిర్మించిన మంచినీటి ట్యాంకుని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చేతుల మీదుగా ప్రారంభించారు. అలాగే నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులో మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సత్యప్రభ చేతుల మీదుగా ప్రారంభించారు. స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో రైతులకు సుమారు రూ.34 లక్షల వ్యయంతో సబ్సిడీతో కూడిన వ్యవసాయ పనిముట్లను ఆయా రైతులకు అందజేశారు. ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, దానిలో భాగంగానే మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ ఉచితంగా ఇచ్చి కుట్టు మిషన్లను లబ్ధిదారులకు అందజేయనున్నామన్నారు. రైతులను అన్ని విధాల ఆదుకునే విధంగా సబ్సిడీలపై రైతులకు అవసరమగు వ్యవసాయ పనిముట్లను అందజేశామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంఆర్ కుమార్ బాబు, అగ్రికల్చర్ అధికారి వైవి గంగాధర్, కూటమి నాయకులు మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబి), యాళ్ల జగదీష్, అమరాది వెంకటరావు, సింగిలిదేవి సత్తిరాజు, సత్యం శెట్టి సీత బాబు, వెలుగుల నాని, ఇళ్ల అప్పారావు, లొండ లోవరాజు, గోపిశెట్టి శ్రీను, దాకారపు కృష్ణ కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : రమణయ్యపేటలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన సాత్విక్ అనే విద్యార్థికి ఉన్నత విద్య కోసం లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ రూ.17 వేలు ఆర్థిక సహాయం అందించింది. క్లబ్ అధ్యక్షురాలు ఎంవివిఎస్ఎల్ ప్రసూన మాట్లాడుతూ దానాలలో కెల్లా విద్యాదానం గొప్పదనే భావంతో తమ క్లబ్ సభ్యులు ఆర్థిక సహాయం అందించారన్నారు. టీసి దేవకీదేవి, శ్రీవిద్య, నాగిరెడ్డి లక్ష్మిలు ఒక్కొక్కరు రూ.5 వేలు చొప్పున అందించగా టి శంకరి రూ.2 వేలు అందించారని ప్రసూన తెలిపారు. క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.